www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Karimnagar, Rangareddy, Hyderabad, Circulated to: Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | కరీంనగర్ | సంపుటి 03 | సంచిక: 285 | గురువారం | 11 జూన్, 2026




# కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం

## 12ఏళ్లుగా ఆ పార్టీ పాపాలను కడుక్కుంటూనే వస్తున్నాం

- 2014కు ముందు.. ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకొచ్చాం
- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ

02



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. వలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు డా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని

తరువాయి 2లో



## దేశం కోసం ఏర్పడ్డదే ఎన్డీయే

- జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పాలన
- దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసిన మోడీ
- ఎన్డీయే పక్షాల భేటీలో ప్రధానిని అభినందించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



## 'పెద్ది' టికెట్ ధరల పెంపుపై వివాదం

- జీవో 121 నిబంధనలు ఉల్లంఘించారు
- హోం శాఖ ముఖ్య కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ప్రత్యేక మెమో జారీపై హైకోర్టులో సవాల్ చేసిన పిటిషనర్
- తదుపరి విచారణ జూన్ 15కు వాయిదా

02

# ప్రపంచానికే మార్గదర్శకం

## 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా ఫ్యూచర్ సిటీ

- ప్రాజెక్టును అడ్డుకునే వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి
- ఎఫ్‌సీడీఏ కార్యాలయం, లోగో, వెబ్‌సైట్ ప్రారంభం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణను ప్రపంచ స్థాయి ఆర్థిక, సాంకేతిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు భవిష్యత్తులో ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం అధికారిక లోగోతో పాటు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం, 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు, భారీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా కాలుష్యరహిత, అత్యాధునిక నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేవలం 150 రోజుల్లోనే ఎఫ్‌సీడీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్న ఆయన, రాష్ట్ర ఆదాయంలో 60 శాతం హైదరాబాద్ నుంచే వస్తోందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా భూముల విలువ బంగారంతో పోటీ పడే స్థాయికి చేరుకుందని వ్యాఖ్యానించారు.



### ఎవరూ అడ్డుకోలేరు..

గతంలో హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన శక్తులే ఇప్పుడు ఫ్యూచర్ సిటీపై విమర్శలు చేస్తున్నాయని సీఎం ఆరోపించారు. విదేశాల్లో కూడా ఈ ప్రాజెక్టును రద్దు చేస్తామని కొందరు నాయకులు వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. ఫ్యూచర్ సిటీని వ్యతిరేకిస్తున్న వారికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని, అలాంటి రాజకీయాలకు భవిష్యత్తు లేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజలు వారిని తిరస్కరిస్తారని పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ అడ్డంకులు వచ్చినా ప్రభుత్వం వెనక్కి తగ్గదని, వచ్చే ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని న్యూయార్క్, సింగపూర్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్తామని వెల్లడించారు.

### ఆక్రమణలే వరదలకు కారణం

హైదరాబాద్‌లో స్వల్ప వర్షానికే రహదారులు జలమయం కావడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోందని సీఎం అన్నారు. గతంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించడమే నేటి

తరువాయి 2లో




## మహిళల భద్రతలో ప్రభుత్వం విఫలం

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడి తప్పాయంటూ విమర్శలు
- బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం కొనసాగిస్తామని వెల్లడి

02

# కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం?

- ఢిల్లీలో వరుస భేటీలతో రాజకీయాల్లో తీవ్రచర్చ
- రాహుల్ గాంధీతో అభిషేక్ బెనర్జీ సమావేశం
- విలీన వార్తలను ఖండించిన టీఎంసీ
- బెంగాల్ కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు



**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భవిష్యత్తుపై కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్, టీఎంసీ అగ్రనేతల మధ్య వరుసగా జరుగుతున్న సమావేశాలు ఇరు పార్టీల మధ్య రాజకీయ సమీకరణాలపై ఊహాగానాలకు ఊతమిస్తున్నాయి. ముఖ్యంగా టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. తాజాగా టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నేతృత్వంలోని పార్టీ ప్రతినిధులు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమైనట్లు సమాచారం. అంతకుముందు ఇండియా కూటమి సమావేశాల సందర్భంగా టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో భేటీ కావడం కూడా రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ అంతర్గతంగా ఎదుర్కొంటున్న సవాళ్లు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలలో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో కాంగ్రెస్‌తో మరింత సన్నిహితంగా పనిచేసే అంశంపై చర్చలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, ఇరు పార్టీల మధ్య విలీనంపై ప్రాథమిక స్థాయిలో చర్చలు జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ కూడా కాంగ్రెస్–టీఎంసీ విలీనాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, కాంగ్రెస్‌లో విలీనం జరుగుతుందన్న ప్రచారాన్ని టీఎంసీ అధికారికంగా ఖండించింది. అలాంటి ప్రతిపాదన

తరువాయి 2లో

## మోడీ పాలన దేశాన్ని వెనక్కి నెట్టింది

02

- తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింది
- విభజన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



## తెలంగాణ నా మాతృభూమి

- భారతీరాజా మృతి సినీ రంగానికి తీరని లోటు

02



## భారతీరాజాకు కన్నీటి వీడ్కోలు

02

- దర్శక దిగ్గజం మృతిపై సినీ ప్రముఖుల సంతాపం
- రజనీ, కమల్, ఇళయరాజా, రెహమాన్ సహా పలువురి భావోద్వేగ నివాళులు

## సినీ రంగానికి తీరని లోటు

02

- భారతీయ చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలు అందించిన దర్శకుడు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్డీయే

- జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పాలన
- దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసిన మోడీ
- ఎన్డీయే పక్షాల భేటీలో ప్రధానిని అభినందించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

న్యూఢిల్లీ: దేశాభివృద్ధి కోసం నిరంతరం తపించే వ్యక్తి.. ప్రధాని మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో నిర్వహించిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచదేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారని చెప్పారు. రాష్ట్రాల అభివృద్ధికి డా ంద్రం పూర్తిగా మద్దతిస్తోందన్నారు. ఎన్డీయే ఏర్పడింది ఎన్నికల కోసం కాదు.. దేశం కోసం. అధికారం కోసం కాదు.. జాతీయ ప్రయోజనాల కోసం. రాష్ట్రాల్లో ఎన్డీయే సాధిస్తున్న వరుస విజయాలే మా పనితీరుకు సాక్ష్యం. బిహార్, అస్సాం, పుదుచ్చేరిలో ప్రజలు మళ్లీ మాకు పట్టం కట్టారు. ఆయా రాష్ట్రాల్లో ఈ విజయాలు.. సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు. బెంగాల్.. మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గర్లోనే ఉంది. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పాలన, ఆవిష్కరణలే భారత్‌కు అతిపెద్ద బలం. అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి భారతీయుడి మనోభావాలు అర్థం చేసుకున్న నాయకుడు.. మోదీ అని చంద్రబాబు అన్నారు. ప్రధానిగా మోదీ గత 12 ఏళ్ల ప్రయాణం... భారత ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానిం చారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. దేశం గర్వించేలా చేయ డంతో పాటు, ప్రపంచదేశాల్లో భారతదేశ గౌరవం పెంచేలా ప్రధాని మోదీ విశేష కృషి చేశారని కొనియాడారు. దేశాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూనే రాష్ట్రాల అభ్యున్నతికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మద్దతుగా ప్రధాని నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సాధారణంగా రాజకీయ టములు ఎన్నికల కోసం ఏర్పడతాయని... కానీ ఎన్డీఏ టమి ఎన్నికల కోసం కాదని... దేశం కోసం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అధికారం కోసం కాదని... జాతీయ లక్ష్యసాధన కోసం ఎన్డీఏ ప్రయాణం సాగుతోందని తెలిపారు. దీనికి రాష్ట్రాల్లో వరుసగా ఎన్డీఏ సాధిస్తున్న విజయాలే సాక్ష్యమని చెప్పుకొచ్చారు. బీహార్‌లో 243 స్థానాల్లో 202 స్థానాల్లో గెలుపు ఎన్డీఏపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అసోం గెలుపు మరోసారి విశ్వాసం వ్యక్తం చేసిందని.. పుదుచ్చేరి విజయం డా మరోసారి ఎన్డీఏకి మద్దతు తెలిపిందని ప్రస్తావించారు. ఇవి వలం ఎన్నికల ఫలితాలు కావని... సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని అభివర్ణించారు. ఒకప్పుడు 'ఈరోజు పశ్చిమబెంగాల్ ఆలోచిస్తే... రేపు భారత్ ఆలోచిస్తుంది' అనే పేరు ఉండేదని చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాల పాటు పశ్చిమబెంగాల్ అభివృద్ధి ప్రధాన స్రవంతికి దూరమైందని తెలిపారు. దేశ సంస్కరణలు, అభివృద్ధి వైపు సాగితే... పశ్చిమబెంగాల్ పాత రాజకీయాల్లోనే చిక్కుకుపోయిందని అన్నారు. తాజా మార్పుతో పశ్చిమబెంగాల్ దిశ మళ్లీ అభివృద్ధి వైపు సాగనుందని వివరించారు. మారుతున్న భారత ఆకాంక్షలకు అనుగుణంగా బెంగాల్ అడుగులు వేస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బెంగాల్ మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గరలోనే ఉందని ప్రస్తావించారు. భారతీయత పునరుజ్జీవం పొందడం గత 12 ఏళ్లలో వచ్చిన అతిపెద్ద మార్పు అని పేర్కొన్నారు. వికాస్ బీ... విరాసత్ బీ నూతన భారత నిర్మాణానికి మార్గదర్శకమని ఉద్ఘాటించారు. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పరిపాలన, ఆవిష్కరణల సమన్వయమే నూతన భారత్ బలమని తెలిపారు. 21వ శతాబ్దానికి భారత్ అందించే గొప్ప సందేశం ఇదేనని.. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ దేశానికి ఉన్న అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. వ్యవస్థను పారదర్శకంగా, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రధాని తీర్చి దిద్దుతున్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. మన కాలంలో అత్యుత్తమ రాజకీయవేత్తల్లో మోదీ ఒకరని ఉద్ఘాటించారు. ప్రపంచ మార్పులో భారత్ భాగస్వామినే కాదని... దిశానిర్దేశర చేసే దేశంగా భారత్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## మోడీ పాలన దేశాన్ని వెనక్కి నెట్టింది

- తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింది
- విభజన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



ప్రజానావ, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శిం చారు. మోదీ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆయన స్పందించారు. దేశంలో రికార్డు స్థాయిలో అప్పులు పెరగడం, అవినీతి ఆరోపణలు, ఇంధన ధరల భారాలు, నిరుద్యోగ సమస్య, పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులు, రూపాయి విలువ పతనం వంటి పరిణా మాలు మోదీ పాలనలోనే చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ పరిణామాల కారణం గా దేశ ప్రతిష్ట దెబ్బతిన్నదని పేర్కొన్నారు. 'కొంత మందిని ఎల్లప్పుడూ, అందరినీ కొంతకాలం మోసం చేయవచ్చు. కానీ యావత్ దేశాన్నే 12 ఏళ్ల పాటు మోసం చేయడంలో మోడీ ప్రభుత్వం విజయం సాధించింది' అని పొంగులేటి వ్యాఖ్యా నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర అభి వృద్ధి అవసరాలు, ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన కీలక హామీల అమలులో కేంద్రం పూర్తిగా విఫల మైందన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటు, తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుకు సహకారం, ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రానికి తగిన మద్దతు, మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి సహాయం వంటి అంశాల్లో కేంద్రం తెలంగాణకు న్యాయం చేయలేదని విమర్శించారు. రాష్ట్రానికి దక్కింది వివక్ష, నిర్లక్ష్యం, నెరవేరని హామీలేనన్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాల్సిన బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం విభజన వాదాన్ని ప్రోత్సహిస్తోందని పొం గులేటి ఆరోపించారు. మతాల మధ్య విద్వేషా లను రెచ్చగొట్టే రాజకీయాలకు బీజేపీ పాల్పడు తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కంటే రాజకీయ లబ్ధినే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణ పట్ల తన వైఖరిని మార్చుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు.

## భారతీరాజాకు అశ్రునయన వీడ్కోలు

- దర్శక దిగ్గజం మృతిపై సినీ ప్రముఖుల సంతాపం
- రజనీ, కమల్, ఇళయరాజా, రెహమాన్ సహా పలువురి భావోద్వేగ నివాళులు

చెన్నై: దక్షిణ భారత సినీ పరిశ్రమలో గ్రామీణ జీవి తాన్ని, మానవ సంబంధాల సౌందర్యాన్ని సహజ త్వంతో వెండితెరపై ఆవిష్కరించిన దిగ్గజ దర్శకు డు భారతీరాజా మరణం సినీ ప్రపంచాన్ని విషాదంలో ముంచెత్తింది. ఆయన పార్థివదేహానికి సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించగా, అభి మానులు కన్నీరుమున్నీరయ్యారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పుష్పాంజలి ఘటించి నివా ళులర్పించారు. సూపర్‌స్టార్ రజినీకాంత్ భారతీ రాజాతో తనకు ఐదు దశాబ్దాల అనుబంధం ఉందని గుర్తుచేసుకుంటూ, ఆయన స్వచ్ఛమైన మనసున్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఎన్నో మంది నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులను సినీ రంగానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే గొప్ప మనసున్న వ్యక్తి అని తెలిపారు. నటుడు కమల్‌హాసన్ మాట్లాడుతూ, భారతీరాజా భౌతికంగా దూరమైనా ఆయన కళ శాశ్వతంగా జీవిస్తుందని పేర్కొన్నారు. ఆయనతో కలిసి పనిచేసే అవకాశం లభించడం తన అదృష్టమని చెప్పారు. సంగీత దిగ్గజం ఇళయరాజా తన జీవితకాల మిత్రుడిని కోల్పోయిన బాధను వ్యక్తం చేస్తూ, వారి మధ్య ఉన్న అనుబంధం మరపురానిదని అన్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ భారతీరాజాను గ్రామీణ తమిళనాడును ప్రపంచానికి పరిచయం చేసిన దర్శకుడిగా అభివర్ణించారు. తమిళ గ్రామాల జీవన విధానాన్ని, ప్రేమను ఆయన చూపించిన విధానం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దర్శకుడు రామ్ గోపాల్ వర్మ భారతీరాజాను భారతీయ సినీ రంగంలో ప్రత్యేక ముద్ర వేసిన దర్శకుడిగా కొనియాడారు. ప్రముఖ నటుడు నాజర్ భారతీరాజాకు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆయన నివసించిన వీధికి భారతీరాజా పేరు పెట్టాలని తమిళనాడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### గొప్ప కథకుడిని కోల్పోయాం: చిరంజీవి

తెలుగు సినీ పరిశ్రమ తరపున చిరంజీవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతీయ సినిమా ఓ గొప్ప కథకుడిని కోల్పోయిందని పేర్కొంటూ, గ్రామీణ జీవిత సౌందర్యాన్ని, సామాన్యుల భావోద్వేగాలను కవిత్వంగా మలిచిన దర్శకుడు భారతీరాజా అని కొనియాడారు. 'ఆరాధన' చిత్రంలో ఆయన దర్శకత్వంలో నటించడం తన అదృష్టమని గుర్తుచేసుకున్నారు. మలయాళ సినీ దిగ్గజం మోహన్‌లాల్ భారతీరాజాను మట్టిలో కవిత్వాన్ని, ప్రతి ఫ్రేమ్‌లో ఆత్మను చూసిన దర్శకుడిగా అభివర్ణించారు. ప్రముఖ నటి రేవతి తాను నటిగా ఎదగడానికి భారతీరాజానే కారణమని భావోద్వేగానికి గురయ్యారు. నటి సుకన్య తన భద్రత కోసం చిత్రీకరణ సమయంలో భారతీరాజా స్వయంగా ముందుండి చూసుకున్న సంఘటనను గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యం తమయ్యారు. దర్శకుడు, నటుడు పార్థిబన్ భారతీ రాజా మరణాన్ని తన మూలాలను కోల్పోయి నట్లుగా అభివర్ణించగా, ప్రముఖ ఛాయాగ్రాహ కుడు రవి కే చంద్రన్ తాను సినీ రంగంలోకి రావడానికి భారతీరాజానే స్ఫూర్తి అని పేర్కొన్నా రు. భారతీయ సినీ రంగంపై చెరగని ముద్ర వేసిన ఈ దర్శక దిగ్గజానికి సినీ ప్రపంచం కన్నీటి వీడ్కోలు పలికింది.

# చీనాబ్‌పై భారీ హైడ్రో ప్రాజెక్టు

- వేగంగా అనుమతుల ప్రక్రియ
- 197 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు ప్రతిపాదన
- 8,700కుపైగా చెట్ల తొలగింపుపై ఆందోళన
- అరుదైన వన్యప్రాణులు, చిల్‌గోజా పైన్ అడవులపై ప్రభావం

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లోని ఖిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై ప్రతిపాదిత కిర్తాయ్–2 జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అటవీ భూమి మళ్లింపు ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 197 హెక్టార్ల అటవీ భూమిని వినియోగించేందుకు చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ సంస్థ కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరింది. సింధు నదీ పరివాహక ప్రాంతంలో చేపడుతున్న ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో కిర్తాయ్–2 ఒకటిగా భావిస్తున్నారు. గత ఏడాది ఇండస్ వాటర్స్ ట్రీటీ అమలును కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన తర్వాత ఈ ప్రాంతంలో జలవనరుల వినియోగాన్ని మరింత వేగవంతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం పెరిగింది. అటవీ భూముల మళ్లింపునకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ పరిధిలోని అటవీ సలహా కమిటీ (ఎఫ్ఏసీ) బుధవారం పరిశీలించింది. అయితే సమావేశానికి సం బంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ప్రాజెక్టు స్థల పరిశీలన నివేదిక ప్రకారం నిర్మాణ పనుల కోసం 8,700కుపైగా చెట్లను తొలగించాల్సి ఉంటుంది. దీంతో స్థానిక పర్యావరణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని నివేదిక హెచ్చరించింది. చెట్ల నరికివేత కారణంగా వర్షపు నీటి ప్రవాహం పెరగడం, నేలకోత తీవ్రతరమవడం, కొండచరి యలు విరిగిపడే ప్రమాదం అధికమయ్యే అవకాశ ముందని పేర్కొంది. అలాగే ఈ ప్రాంతం అరుదైన చిల్‌గోజా పైన్ చెట్లకు ముఖ్యమైన సహజ ఆవా సంగా గుర్తించబడింది. అటవీ భూమి మళ్లింపు వల్ల ఈ చెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని నివేదిక వెల్లడించింది. ముఖ్యం గా ఖిష్త్వార్‌లోని పద్దార్ ప్రాంత ప్రజలకు చిల్‌గో జా గింజల సేకరణ ఒక ప్రధాన జీవనాధారంగా ఉండటంతో స్థానిక ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. ప్రాజెక్టు పరిధిలో అరుదైన మరియు అంతరించిపోతున్న జాతులకు చెందిన వన్యప్రాణులు నివసిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. హిమాలయన్ బ్రౌన్ బేర్, హిమాలయన్ థార్, ఆసియాటిక్ ఐబెక్స్, ఆసియాటిక్ బ్లాక్ బేర్ వంటి జంతువులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. అయితే ప్రాజెక్టును జాతీయ ప్రాధాన్యమున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా అభివర్ణించిన అధికారులు, అభివృద్ధి అవసరాలు మరియు పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇదిలా ఉండగా, కిర్తాయ్–2 ప్రాజెక్టు నిర్మాణం వల్ల సుమారు 446 కుటుంబాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యే అవకాశముందని స్థల పరిశీలన నివేదిక వెల్లడించింది. ప్రాజెక్టుకు తుది అనుమతులు లభించిన అనంతరం పర్యావరణ, సామాజిక ప్రభావాలపై మరింత విస్తృత చర్చ జరిగే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

## మహిళల భద్రతలో ప్రభుత్వం విఫలం

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

ప్రజానావ, హైదరాబాద్ : రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని, మహిళల భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఖమ్మంలో బాలికపై జరిగిన దారుణ ఘటన, మల్కాజ్‌గిరిలో మహిళ కాల్చివేత సంఘటనలు శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని విమర్శించిన కవిత, బాధితులకు న్యాయం జరిగేలా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరపున 50 శాతం టికెట్లు బీసీ నాయకులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ నా మాతృభూమి

- కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రాంతీయ విద్వేషాలు
- నన్ను లక్ష్యంగా చేసుకుని నేతలు విమర్శలు చేస్తున్నారు
- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపైనే పూర్తి దృష్టి
- జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 10: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మళ్లీ ప్రాంతీయ విద్వేషాలు ప్రోత్సహించబడుతున్నాయని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విమర్శించారు. గత 13 నెలలుగా కాంగ్రెస్ నాయకులు తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో ఓ టెలివిజన్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ ఆవిర్భావం తెలంగాణలోనే జరిగిందని గుర్తుచేశారు. అలాంటి తనను తెలంగాణకు రావొద్దని చెప్పే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తనపై ఇలాంటి రాజకీయ దాడులు జరగలేదని, తెలంగాణకు రాకుండా ఎవరూ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు తనను రాజకీయంగా టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌కు రావడానికి ఎవరి అనుమతి అవసరం లేదని స్పష్టం చేసిన పవన్ కల్యాణ్, ''తెలంగాణ ఎవరి జాగీరు కాదు.. ఇది నా మాతృభూమి'' అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సభ నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారని, రాష్ట్రంలోకి రానివ్వమంటూ బెదిరింపులు కూడా వచ్చాయని ఆరోపించారు. తెలంగాణలో జనసేనకు నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, ఎన్నికల్లో పోటీ చేయడం తమ రాజకీయ హక్కు అని అన్నారు. అయితే తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యక్షంగా పోటీ చేయాలనే వ్యక్తిగత ఆసక్తి తనకు లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిలాషలకు అనుగుణంగా మాత్రమే సహకరిస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం తన ప్రధాన దృష్టి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపైనే కేంద్రీకృతమైందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాంతాలు, కులాలు, రాజకీయ ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమనే భావనతో జనసేన పనిచేస్తోందని పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అవసరమేనని, అయితే రాజకీయ లబ్ధి కోసం విచక్షణారహితంగా ఉచిత హామీలు ఇవ్వడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి చర్చించి ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. కుల రాజకీయాల అంశాన్ని ప్రస్తావిస్తూ, దేశ రాజకీయాల్లో ఎదగడానికి కేవలం కులం మాత్రమే కారణం కాదని అన్నారు. కుల రాజకీయాలపై సమగ్ర అవగాహనతోనే చర్చ జరగాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

## 'పెద్ది' టికెట్ ధరల పెంపుపై వివాదం

- జీవో 121 నిబంధనలు ఉల్లంఘించారు
- తదుపరి విచారణ జూన్ 15కు వాయిదా

ప్రజానావ, హైదరాబాద్: మెగా పవర్‌స్టార్ రాం చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో టికెట్ ధరల పెంపు అంశం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్‌పై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. సినిమా విడుదల సందర్భంగా టికెట్ ధరలను తాత్కాలికంగా పెంచుకునేందుకు రాష్ట్ర హోంశాఖ ఈ నెల 2న ప్రత్యేక మెమో జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం జూన్ 4 నుంచి పది రోజుల పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.100, మల్టీప్లెక్సుల్లో రూ.125 వరకు అదనంగా వసూలు చేసుకునేందుకు అనుమతి కల్పించింది. అయితే, ఈ అనుమతులు గతంలో హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపిస్తూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. సినిమా టికెట్ ధరల నియంత్రణకు సంబంధించిన జీవో నంబర్ 121లో పేర్కొన్న నిబంధనలను పక్కనపెట్టి హోంశాఖ ప్రత్యేక మెమో జారీ చేసిందని పిటిషనర్ వాదించారు

## కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం?

(మొదటిపేజీ తరువాయి)

తమ ముందుకు రాలేదని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఇప్పటివరకు ఈ అంశంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయినప్పటికీ ఢిల్లీలో జరుగుతున్న వరుస భేటీలు, బెంగాల్ రాజకీయాల్లో మారుతున్న పరిస్థితులు, టీఎంసీలో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్–టీఎంసీ సంబంధాలపై మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### బెంగాల్ కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు

ఇదిలా ఉండగా, మమతా బెనర్జీతో కాంగ్రెస్ అధిష్టానం కొనసాగిస్తున్న సంప్రదింపులు పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను బహిర్గతం చేస్తున్నాయి. టీఎంసీతో సన్నిహిత సంబంధాల ఏర్పాటును కొందరు కాంగ్రెస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టీఎంసీ పాలనలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, పరిపాలనా వైఫల్యాల ప్రభావం కాంగ్రెస్‌పై పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాజీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి, సీనియర్ నేత అబ్దుల్ మన్నన్ ఈ ప్రతిపాదనకు బహిరంగంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. మమతా బెనర్జీతో ఎలాంటి రాజకీయ పొత్తు లేదా విలీనానికి తాము అనుకూలం కాదని పేర్కొన్న మన్నన్, అలాంటి నిర్ణయం కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు అధిర్ రంజన్ చౌదరి స్పందిస్తూ, గతంలో కాంగ్రెస్‌ను బలహీనపరిచిన టీఎంసీ ఇప్పుడు అదే కాంగ్రెస్ మద్దతు కోరాల్సిన పరిస్థితి రావడం రాజకీయ పరిణామాల్లో భాగమని వ్యాఖ్యానిం చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్–టీఎంసీ సంబంధాల భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## ప్రపంచానికే మార్గదర్శకం

(మొదటిపేజీ తరువాయి)

వరదల ప్రధాన కారణమని ఆరోపించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసిన ఆయన, రాజేంద్రనగర్, నల్లచెరువు, బతుకమ్మకుంట వంటి నీటి వనరుల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గండిపేట, హిమాయత్ సాగర్ పరిసరాల్లో జరిగిన ఆక్రమణలపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువుల ఆధారంగా 'లేక్ ఎకానమీ' అభివృద్ధి చేసి మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు.

### అభివృద్ధి చరిత్రలో ప్రత్యేక రోజు

ఫ్యూచర్ సిటీ ఆవిర్భావంతో తెలంగాణ అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెడుతోందని సీఎం పేర్కొన్నారు. జూన్ 10 తేదీ రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతుందని అన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో కొత్త గ్రామాలను చేర్చామని, స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎఫ్‌సీడీఏ పనితీరును తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తారని ప్రకటించారు.


### బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం: భట్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ నాయకత్వం ఫ్యూచర్ సిటీపై తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. తెలంగాణను ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీకి బదులుగా గ్రీన్ ఫార్మా, గ్రీన్ ఎనర్జీ ఆధారిత అభివృద్ధి నమూనాను అమలు చేస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్కిల్స్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు వలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు.తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరి కం నుంచి బయటప డేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు.



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివ రించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హ యాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాల డా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్– 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యాని ంచారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరిం చారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకో వాలని సూచించారు. మేడ్ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టి పెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడు గు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఒకటో తేదీకే జీతాలు.. చారిత్రాత్మక నిర్ణయం

- ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి జూపల్లి హర్షం
- ఉద్యోగులకు ఆర్థిక భరోసా, కుటుంబాలకు అండగా నిలిచే చర్య



ప్రజానావ, హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్న ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నిర్ణయం ఉద్యోగుల జీవితాల్లో ఆర్థిక క్రమశిక్షణ, స్థిరత్వాన్ని తీసుకురావడంతో పాటు వారి కుటుంబాలకు భరోసానిస్తుందని పేర్కొన్నారు. జీతాల చెల్లింపులపై ఆర్థిక శాఖ జారీ చేసిన తాజా ఉత్తర్వులు ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీతాల చెల్లింపుల్లో నెలకొన్న అనిశ్చితితో ఉద్యోగులు ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాష్ట్ర ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# మేడారం అభివృద్ధి పనులు వేగవంతం

- పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం
- గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు, భక్తులకు శాశ్వత సౌకర్యాలపై దృష్టి



ప్రజానావ, తాడ్వాయి : మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతల ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి మేడారం మహాజాతర ప్రతీకగా నిలిచిందని పేర్కొన్న మంత్రి, జాతర సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, జంపన్నవాగు పరిసరాలు, ప్రధాన రహదారులు, భక్తుల రాకపోకల మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత తదితర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. జంపన్నవాగును పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయడానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. మేడారంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, శాశ్వత ప్రాతిపదికన 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వరదల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, కుంటలు, చెరువులు, కరకట్టల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి అవసరమైన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు.

# గంజాయికి యువత దూరంగా ఉండాలి

- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- డీజీపీ సీవీ ఆనంద్
- రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచన
- హెల్మెట్లు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు, క్రీడా సామగ్రి పంపిణీ



ప్రజానావ, ఆదిలాబాద్ : గంజాయి సహా మాదకద్రవ్యాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గుడిహత్నూర్ మండలం తోషం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆదివాసీల సమస్యలను తెలుసుకున్న డీజీపీ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మందికి హెల్మెట్లు పంపిణీ చేసి, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లలో సీట్ బెల్ట్ వినియోగం కూడా తప్పనిసరని చెప్పారు. ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడేందుకు 30 మంది ఆటో డ్రైవర్లకు ఫస్ట్‌ఎయిడ్ కిట్లు అందజేశారు. ఆదివాసీ యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ పలు గ్రామాల యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సులు అందజేయగా, గతంలో లొంగిపోయిన ముగ్గురు మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# యూరియా కొరతకు చెక్.. రైతులకు పూర్తి భరోసా

- నెలకు 4 లక్షల టన్నుల యూరియా సరఫరాకు కేంద్రం హామీ : తుమ్మల
- రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల పేర్లతో జరుగుతున్న అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు



ప్రజానావ, ఖమ్మం : రాష్ట్ర రైతాంగానికి యూరియా కొరత రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యూరియా సరఫరాలో తాత్కాలిక జాప్యం ఉన్నప్పటికీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా సరుకు నౌకల రాకపోకలు ఆలస్యమవుతున్నాయని, నౌకలు చేరిన తర్వాత కూడా రైళ్లు, లారీలు, హమాలీల కొరత వల్ల పంపిణీలో జాప్యం జరుగుతోందని వివరించారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంతో చర్చించి నెలకు 2 లక్షల టన్నుల స్థానంలో 4 లక్షల టన్నుల యూరియా సరఫరా చేసేలా హామీ పొందినట్లు వెల్లడించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా రైతులు నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రైతుల ప్రయోజనాల కోసం భారీగా నిధులు వెచ్చించి, అవసరమైతే ఇతర ఖర్చులను సైతం తగ్గించి రైతాంగానికి అండగా నిలిచామని చెప్పారు. తెలంగాణ రైతుల పేర్లతో పొరుగు రాష్ట్రాల రైతులు ధాన్యం, మొక్కజొన్న విక్రయిస్తూ బోనస్‌లు పొందుతున్న ఘటనలు ఆందోళనకరమని పేర్కొన్న తుమ్మల, ఇటువంటి అక్రమాలను కఠినంగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్లలో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేసి నిజమైన రైతులకు మాత్రమే ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# టీజీ సీపీగెట్ దరఖాస్తులకు మరో అవకాశం

- జూన్ 15 వరకు గడువు పొడిగింపు
- ఫైన్ లేకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు

ప్రజానావ, కాకతీయ యూనివర్సిటీ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ సీపీగెట్–2026 ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువును పొడిగించారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 15 వరకు అవకాశం కల్పించినట్లు టీజీ సీపీగెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్లా తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గడువు ముగిసే వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు టీజీ సీపీగెట్–2026 కీలక ప్రవేశ పరీక్షగా నిర్వహించబడుతున్న నేపథ్యంలో విద్యార్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పరీక్షకు హాజరయ్యే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కన్వీనర్ విజ్ఞప్తి చేశారు.

# నెహ్రూను అవమానించడం తగదు

## బీజేపీ నేతల వ్యాఖ్యలపై మంత్రి పొన్నం విమర్శలు

ప్రజానావ, హైదరాబాద్ : భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను తక్కువ చేసి మాట్లాడడం చరిత్రను అవమానించడమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. దేశ నిర్మాణంలో నెహ్రూ చేసిన సేవలను విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. వీడియో సందేశంలో మాట్లాడిన ఆయన, స్వాతంత్ర్యం అనంతరం ఆహార కొరత, నిరుద్యోగం, పారిశ్రామిక వెనుకబాటు వంటి సవాళ్ల మధ్య దేశాన్ని స్వావలంబన దిశగా నడిపించిన నాయకుడు నెహ్రూనేనని పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఆయన బలమైన పునాదులు వేశారని తెలిపారు. పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు నేటి భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచాయని చెప్పారు. నెహ్రూ వారసత్వాన్ని విస్మరించి దేశ అభివృద్ధి విజయాలను పూర్తిగా బీజేపీ ఖాతాలో వేసుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధికి పునాదులు వేసిన మహానేతల సేవలను కించపరిచే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



# ఘనంగా చింతల రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజానావ, ఖైరతాబాద్: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఫిలింనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద బుధవారం ఫిలింనగర్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రభారి వీరెల్లి చంద్రశేఖర్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు పందిర్ల ప్రసాద్, జిల్లా కార్యదర్శి శ్రావణ్ యాదవ్, ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు గందె అరుణ్‌కుమార్, ఖైరతాబాద్ అసెంబ్లీ బీజేవైఎం కన్వీనర్ దండుగుల శేఖర్ పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ సీనియర్ నాయకులు బోయ రామాంజనేయులు, సంపంగి రామకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుంటి ఆనంద్ సాగర్, డివిజన్ ఉపాధ్యక్షుడు వలిశెట్టి రాంబాబు, డివిజన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పురుషోత్తం, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మక్కల నరేశ్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రమ్య, పద్మ, డివిజన్ యువ మోర్చా అధ్యక్షుడు మంజల నరసింహ, బీజేవైఎం నాయకులు హరీశ్ ముదిరాజ్, మోహన్ సాగర్, రాజేష్, శివ, పోలింగ్ బూత్ నాయకులు ఎం. రాజు, వల్లెపు అరవింద్, లాజరు తదితరులు హాజరయ్యారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు, బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చింతల రామచంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





# ప్రజాసేవలో చింతల పాత్ర ఆదర్శం

- ఖైరతాబాద్ అభివృద్ధిలో ఆయనది కీలకపాత్ర
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిపై బీజేపీ నేతల ప్రశంసలు

ప్రజానావ, ఖైరతాబాద్: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితభావంతో నిరంతరం కృషి చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి ఖైరతాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా వేలాది కుటుంబాలకు అండగా నిలిచిన ఆయన సేవలు ఆదర్శప్రాయమని నేతలు అభినందించారు. సమాజ అభ్యున్నతికి ఆయన అందిస్తున్న సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం నాయకులు చింతల రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు,
నియోజకవర్గ కేంద్రాలు,
మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169

EDITORIAL



### 370 రద్దుతో .. నెహ్రూ రికార్డును

# అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దల కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటు వాద, ఉగ్రవాద మూకలను కుకటి వేళ్లతో పెరికేశారు. మోడీ ధృఢ సంకాల్పినికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజుల పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలందించిన, నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా, అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుల్లిన ఘనత మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్‌షా వ్యూహాలను తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యతలు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్టమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వతంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య టమిలో బీజేపీ తరపున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూల విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్ల వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీ ఎవరికీ సాధ్యం కాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి, మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంతికంగా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.

# గోలన్‌కొండలో కలెక్టర్ పర్యటన

ప్రజానావ, యాదాద్రి భువనగిరి:ఆలేరు మండలం గోలన్‌కొండ గ్రామంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యటించి అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలు, హెల్త్ సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. గ్రామంలో అమలవుతున్న ఆరోగ్య, విద్యా సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ముందుగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు నిర్వహిస్తున్న ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. పిల్లలకు నిర్వహిస్తున్న పరీక్షలు, అనంతరం అందిస్తున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని చిన్నారుల తల్లిదండ్రులు ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల పిల్లల ఎదుగుదల స్థితిని సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. అలాగే చిన్నారుల తల్లులు కూడా క్రమం తప్పకుండా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తల్లుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణ దశలో నిలిచిపోయిన నూతన అంగన్వాడీ భవనాన్ని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదుపరి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్, నిర్మాణం పూర్తయి ఇంకా ప్రారంభం కాని డైనింగ్ హాల్, నూతన తరగతి గదులను పరిశీలించారు. అవి ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకొని, మిగిలిన పనులు ఉంటే వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమం అమలుపై ఆరా తీసిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, బోధన ప్రమాణాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్, సిబ్బంది వివరాలు, ఆశా కార్యకర్తల సంఖ్య, రోజువారీ ఓపీ నమోదు, నిర్వహిస్తున్న వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎన్‌సీడీ కేసుల సంఖ్య, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పర్యవేక్షణ, నెలవారీ వైద్య పరీక్షల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల సంఖ్య, అందులో సాధారణ ప్రసవాల శాతం గురించి వివరాలు తెలుసుకొని నార్మల్ డెలివరీల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఆయాలు గర్భిణీ స్త్రీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి : అనురాగ్ జయంతి**

జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడంతో పాటు రోడ్డు భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశం, రోడ్డు భద్రతా సమీక్ష సమావేశాల్లో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని, విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## అనుమతులు లేకుండా నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయం

• షాపును సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు



ప్రజానావ, జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రావ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అనుమతులు లేకుండా నోట్‌బుక్స్, యూనిఫాంలను విక్రయిస్తున్నారనే సమాచారంతో మండల విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్కూల్‌కు సంబంధించిన ఓ షట్టర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయం జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు, అవసరమైన అనుమతులు లేకపోవడంతో ఆ షట్టర్‌ను సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యాలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించరాదని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడే విధంగా ఒకే చోట నోట్‌బుక్స్, యూనిఫాంల కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. పాఠశాలలు విద్య అందించడంపైనే దృష్టి సారించాలని, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించాలంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా విద్యార్థులకు సంబంధించిన వస్తువుల విక్రయం నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జహీరాబాద్ మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం


• సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్




ప్రజానావ, సిద్ధిపేట: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మిలిటెంట్ ఉద్యమానికి శ్రీకారం చూడతామని సిద్ధిపేట జిల్లా సీపీఐ కార్యదర్శి మంద పవన్ అన్నారు. బుధవారం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ సమితి పిలుపు మేరకు సీపీఐ సిద్ధిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో సిద్ధిపేట కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మంద పవన్ మాట్లాడుతూ.... దేశ ప్రజలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో అల్లాడుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తోందని తీవ్రంగా విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వం భారీ ఎత్తున పన్నులు విధించడం వల్ల రవాణా వ్యయం పెరిగి, కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. ఒకవైపు నిరుద్యోగం పెరుగుతుంటే, మరోవైపు ధరల భారం పెరిగి సామాన్య కుటుంబాలు రెండు పూటల భోజనం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానందరిఫ్, మిట్టపల్లి సుధాకర్, సంగెం మధు, రామగళ్ల నరేష్, నర్సింహారెడ్డి, భిక్షపతి, నర్సింహులు, నాయకులు బోనగిరి శ్రవణ్, మహేష్, శ్రీనివాస్, సురేష్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రామ్మూర్తి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియపై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి

• సర్‌లో ప్రతి ఓటరు పేరును క్షుణ్ణంగా పరిశీలించాలి
• డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పిలుపు



ప్రజానావ, నాగర్ కర్నూల్: కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఓటర్ పేరును క్షుణ్ణంగా పరిశీలించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. పిసిసి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని బిఎల్ఎలకు బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ జూన్ 25 నుండి జూలై 24 వరకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటికి తిరుగుతూ ఓటర్ల వివరాలను సేకరిస్తారని ఈ సమయంలో వారి వెంట కాంగ్రెస్ పార్టీకి చెందిన బిఎల్ఎలు ఉండాలని ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గురించి ఆయన వారికి అవగాహన కల్పించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేస్తూ తమకు అనుకూలంగా పని చేసేలా కుట్రలు కుతంత్రాలు చేస్తుందని ఇందులో భాగమే ఎస్ ఐ ఆర్ ప్రక్రియని ఆరోపించారు ఇప్పటికే ఈ ప్రక్రియ ద్వారా దేశంలోని అనేక రాష్ట్రాలలో ఓటరు జాబితాలో ఉద్దేశపూర్వకంగా తమకు ఓటు పడవనే పేర్లను గుర్తించి తొలగించారని ఆరోపిస్తూ హర్యానా మహారాష్ట్ర పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో జరిగిన ఘటనలను ఆయన వివరించారు. ముఖ్యంగా వలస కూలీలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు విద్యార్థులు తదితర పేర్లను తొలగించే అవకాశం ఉందని ఈ సమయంలో ప్రతి బిఎల్ఏ అప్రమత్తంగా ఉండాలని అర్హుడైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతిబిఎల్ఏ కృషి చేయాలని ఈ విషయంలో బిఎల్ఓ లకు సహకరించాలని సూచించారు. హోటల్ జాబితా సవరణ విధానం కొత్త ఓటర్ల నమోదు తప్పుల సవరణ డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడం వంటి అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రతి బూత్ స్థాయిలో ఖచ్చితమైన డేటా సేకరణ సమన్వయం బాధ్యతహితంగా పని చేయాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రతి ఓటరు పేరు ఉండాల్సిన అవశ్యకత గురించి వివరించారు. బిఎల్ఎలు తమ పరిధిలో కొనసాగే ఓట్ల జాబితా పరిశీలనలో అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా పనిచేస్తూ అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో పార్లమెంట్ సంఘటన సృజన అభియాన్ కోఆర్డినేటర్ ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమాల ఇన్‌చార్జి రాచమల్ల సిద్దేశ్వర, వ్యవసాయ మార్కెట్ యాడ్ చైర్మన్ రమణ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గంలోని బిఎల్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ప్రజానావ, నాగర్ కర్నూల్: వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు కూడా జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం బుధవారం తెలకపల్లి మండల కేంద్రంలోని ఎరువులు విత్తనాల దుకాణాలపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. తెలకపల్లి మండల వ్యవసాయ అధికారి నర్మద, ఎస్సై రమేష్ తహసిల్దార్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలోని టాస్క్ ఫోర్స్ బృందం తెలకపల్లిలోని మన గ్రోమోర్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలను, గోదామును తనిఖీ చేశారు. బాలకృష్ణ ట్రేడర్స్‌లో స్టాక్ రిజిస్టర్లలో ఓపెనింగ్ బ్యాలెన్స్ లోపాలున్నట్లు గుర్తించి నిబంధనల ఉల్లంఘనపై బాలకృష్ణ ట్రేడర్స్కు ఇకమీదట అమ్మకాలు చేయవద్దంటూ నోటీసులు జారీ చేశారు. నకిలీ విత్తనాలు ఎరువులు క్రిమిసంహారక మందులను అమ్మినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని వారు దుకాణ యజమానులను హెచ్చరించారు.

## మంజీరా ఎత్తిపోతల పథకం భూసేకరణపై పునరావాస కమిటీ సమీక్ష



ప్రజానావ, కామారెడ్డి: మంజీరా ఎత్తిపోతల పథకం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియపై ప్రాజెక్టు స్థాయి పునరావాస, పునర్నిర్మాణ (ఆర్&ఆర్) కమిటీ బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పిట్లం మండలంలోని నాగంపల్లి, పెద్ద అన్నారం గ్రామాల్లో మంజీరా ఎత్తిపోతల పథకం కోసం చేపడుతున్న భూసేకరణ అంశాలను కమిటీ పరిశీలించింది. భూసేకరణ అత్యల్ప విస్తీర్ణంలో మాత్రమే జరుగుతున్నందున ఎలాంటి నివాస గృహాల స్థానచలనం జరగడం లేదని, స్థానిక కుటుంబాల జీవనోపాధిపై కూడా ప్రతికూల ప్రభావం ఉండదని కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో నాగంపల్లి, పెద్ద అన్నారం గ్రామాల్లో సేకరిస్తున్న భూములకు సంబంధించి భూ సేకరణ, పున రావాసం పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం–2013 ప్రకారం పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు వర్తించవని కమిటీ నివేదించింది. అదనపు కలెక్టర్ (రెవెన్యూ), బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో), నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, ప్రధాన ప్రణాళికాధికారి (సీపీవో), పిట్లం తహసీల్దార్, భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) పిట్లం శాఖ మేనేజర్‌తో పాటు ఆర్&ఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత మనందరి బాధ్యత

• పోలీస్ కమిషనర్ సునీల్ దత్
• నాయకులగూడెం గ్రామసభలో రోడ్డు భద్రపై అవగాహన

ప్రజానావ, పాలేరు:రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి ప్రాణాలకు రక్షణగా నిలిచే అత్యవసరమైన అంశమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం కూసుమంచి మండలం నాయకులగూడెం గ్రామంలోని పీవి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన గ్రామసభలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... రోడ్డుపై ప్రతి ఒక్కరి బాధ్యతాయుతమైన ప్రవర్తన ఎంతో మంది కుటుంబాల జీవితాలను కాపాడుతుందన్నారు. ప్రయాణికులందరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడానికి ఇది దోహదపడుతుందన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం, వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రత వహించడం, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎన్నో ప్రాణాంతక ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్‌ను ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవర్‌తో పాటు పక్కన కూర్చున్న వారు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. వాహనాన్ని పరిమిత వేగంతో మాత్రమే నడపాలని, వేగం పెరిగే కొద్దీ ప్రమాదాలు జరిగే అవకాశం, వాటి తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. మద్యం, మత్తు పదార్థాలను సేవించి ఎప్పుడూ వాహనం నడపకూడదన్నారు. ఇది మీ ప్రాణాలకే కాక ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లలో మాట్లాడటం, మెసేజ్ చేయడం వంటివి చేస్తే మీ ఏకాగ్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్, బోర్డులు, సూచికలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు దాటేటప్పుడు ఎల్లప్పుడూ జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలన్నారు. వాహనదారులు సైతం పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికేట్ వెంట ఉంచుకోవాలన్నారు. ఇటీవల కూసుమంచి మండలంలో యాక్సిడెంట్‌కు గురైన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సలహాలు సూచనలు ప్రజలకు తెలియజేశారు. అదేవిదంగా ప్రమాదానికి గురై చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధర్మ తండా చెందిన జర్పుల లలిత కుమారుడు సందీప్ యాక్సిడెంట్ గురై చనిపోయిన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతి రెడ్డి, కూసుమంచి సీఐ టి. సంజీవ్ కూసుమంచి ఎస్ఐ నాగరాజు తిరుమలయపాలెం ఎస్ఐ జగదీష్, నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్, ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ స్రవంతి, పిఎస్ఐ దివ్య, కూసుమంచి ఎమ్మార్వో డి సైదులు, ఎంపీడీవో రాజారాం, అగ్రికల్చర్ ఏవో రామడుగు వాణి , ఎంఈఓ వీరస్వామి, ఆర్ & బి డిపార్ట్మెంట్, ఇతర అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్ కాంచారి సైదమ్మ, గ్రామ ప్రజలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జీడికే 11వ గని మేనేజర్‌గా మ్యాచ్ జాన్సన్



ప్రజానావ, రామగుండం: జీడీకే–11 ఇంక్లైన్ గని నూతన మేనేజర్ గా మాథ్యూస్ జాన్సన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం చిలక శ్రీనివాస్ ఏజెంట్ నారాయణమూర్తి గ్రూపు ఇంజనీర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం. మల్లేష్ ఎస్ఓ, డి.రాకేష్ పిట్ ఇంజనీర్, ఎం.నారాయణ డిప్యూటీ ఎస్ఎస్ఓ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే కార్మిక సంఘాల నాయకులు మద్ది ఎల్లయ్య ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, రంగు శ్రీనివాస్, బ్రాంచ్ సెక్రటరీ నాయిని శంకర్ పిట్ సెక్రటరీ, సూపర్వైజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాథ్యూస్ జాన్సన్ మాట్లాడుతూ ఆర్‌జీ–1ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, ఏజెంట్ చిలకశ్రీనివాస్, గ్రూప్ ఇంజనీర్ నారాయణ మూర్తి మార్గదర్శకత్వంలో గనికి నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గని అధికారులు, సూపర్వైజర్లు, టెక్నీషియన్లు, ఉద్యోగులు అన్ని కార్మిక సంఘాలు సహకరించాలని ఆయన కోరారు.

## నిరుద్యోగ యువతకు ఆధునిక వృత్తి కోర్సుల్లో శిక్షణ

- శిక్షణ సదస్సులో జీఎం లలిత్ కుమార్






ప్రజానావ, రామగుండం: రామ గుండం ఏరియా–1 ఆధ్వర్యంలో స్థానిక నిరుద్యోగ యువతీ యు వకులకు ఉచిత వృత్తి విద్యా కోర్సు ల్లో శిక్షణకు అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం సింగరేణి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన పేర్ల నమోదు కార్యక్రమానికి ఆర్‌జీ వన్ జియం లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నిరుద్యో గులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే సత్సంకల్పంతో సింగరేణి సంస్థ ఆర్జీ–1 ఏరియా స్కిల్ డెవలప్‌మెంట్ సెం టర్ ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా సోలార్ టెక్నిషియన్, డ్రోన్ టెక్నాలజీ, గ్యాస్ కట్టింగ్, వెల్డింగ్, కాస్మేటాలజీ, సెల్ ఫోన్, సిసిటివి రిపేరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, డిటిపి డిజైన్ తదితర వినూత్న ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందగోరు అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక యువతకు ఉపాధి మార్గాలు చూపడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. రామగుండం పరిసర ప్రాంతా ల నుండి నిరుద్యోగ యువతీ యువకులు 400 మంది వరకు అభ్యర్థులు భారీ సంఖ్యలో తరలివచ్చి, తమ పేర్లను ఉత్సాహంగా నమోదు చేసుకున్నారని తెలిపారు.

Singareni news

## సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

- గుర్తింపు సంఘం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



ప్రజానావ, రామగుండం: సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను యాజమాన్యం పరిష్కారం చేయకుంటే జూన్ 22 తర్వాత సమ్మెకు పిలుపు నిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం, రాష్ట్రప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారంలో వైఫల్యం చెందాయని పేర్కొన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన తర్వాత కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో మూడు సార్లు డైరెక్టర్ ఫా, రెండు సార్లు సి అండ్ ఎండి స్థాయిలో సమావేశాలు జరిగినా ఎలాంటి అంగీకారం జరుగలేదని ఆయన పేర్కొన్నారు. కార్మికుల ఆందోళన నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా ఏఐటియుసి జూన్ 7,8 తేదిల్లో కొత్తగూడెంలో కేంద్ర కమిటీ సమావేశాల్లో సభ్యులు అంతా సమ్మె చేయాలని, నోటీసు ఇచ్చి సమ్మెలోకి పోవాలని నిర్ణయం మేరకు జూన్ 8న 31 డిమాండ్‌లపై సమ్మె నోటీసును పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం యాజమాన్యానికి ఇవ్వడం జరిగిందన్నారు. సమ్మె నోటీసులో ముఖ్యంగా సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, నిలిచిపోయిన మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలని, మారుపేర్ల విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటులకు అలియాస్‌గా మార్చి ఉద్యోగాలు ఇవ్వాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని,పెర్క్స్‌పై ఇన్ కం టాక్స్ యాజమాన్యం చెల్లించాలని, తదితర డిమాండ్‌లపై సమ్మె నోటీసును యాజమాన్యానికి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు ఎల్లా గౌడ్, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శులు స్వామి, రాంచందర్, బ్రాంచి కార్యదర్శులు రంగు శ్రీను, గంధంసాంబశివ రావు, నాయకులు గండిప్రసాద్, అటికేటి రాజు, రంజిత్, చేరాలు, రామస్వామి, సమ్మయ్య, రమేశ్ గౌడ్, నల్ల మహేష్, జీవన్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో రూ.2వేల కోట్ల దోపిడీ

- రైతుల నష్టాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి
- ఇసుక డంపుల వ్యవహారం, రైతు భరోసా, రుణమాఫీపై విమర్శలు



ప్రజానావ, జగిత్యాల: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ ప్రక్రియలో భారీ స్థాయిలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, సుమారు రూ.2 వేల కోట్ల మేర మిల్లర్ల దోపిడీ జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి ఆరోపించారు. రైతుల దోపిడీపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్‌పర్సన్ దావా వసంత సురేష్, జగిత్యాల మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ మున్నా, పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. ధర్మపురి తహసీల్దార్ సీజ్ చేసిన 3 వేల ఇసుక డంపుల వ్యవహారాన్ని ప్రస్తావించిన జీవన్‌రెడ్డి, సుమారు రూ.30 లక్షల విలువైన ఇసుక ఏమైందని ప్రశ్నించారు. ఆ డబ్బు ఎవరి వద్దకు వెళ్లిందో మంత్రి లక్ష్మణ్‌కుమార్ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

**మిల్లర్ల దోపిడీకి నేనే ప్రత్యక్ష సాక్షిని..**

ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలపై తన సొంత అనుభవాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. తాను విక్రయించిన 544 బస్తాల ధాన్యానికి 218 క్వింటాళ్ల బరువు నమోదైనా, ట్రక్‌షీట్‌లో కేవలం 190 క్వింటాళ్లకే నమోదు చేశారని ఆరోపించారు. దీంతో సుమారు 28 క్వింటాళ్లకు సమానమైన నష్టం జరిగిందన్నారు. మరో రైతుకు ధర్మకాంటా ప్రకారం 271 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, 250 క్వింటాళ్లకే ట్రక్‌షీట్ జారీ చేశారని తెలిపారు. జగిత్యాల జిల్లాలోనే 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణలో క్వింటాల్‌కు 10 కిలోల చొప్పున కోత విధించడం వల్ల రైతులు భారీగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ లెక్కన జిల్లాలోనే సుమారు రూ.125 కోట్ల మేర దోపిడీ జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా అది రూ.2 వేల కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికారులు, రాజకీయ నాయకులకు వాటాలు ఉన్నాయా అనే అనుమానం వ్యక్తం చేశారు.

**నేనెప్పుడూ వాస్తవాలే మాట్లాడుతా**

మంత్రి లక్ష్మణ్‌కుమార్‌పై విమర్శలు గుప్పించిన జీవన్‌రెడ్డి, నేను ఎప్పుడూ వాస్తవాలనే మాట్లాడుతాను. మంత్రి పదవి వచ్చిన తర్వాత ఆయన వాస్తవాలను విస్మరిస్తున్నారు. రైతుల దోపిడీ ఆయనకు కనిపించడం లేదు అని అన్నారు. తాను చూపిస్తున్న ఆధారాలను పరిశీలించాలని, రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, రైతుల పక్షాన నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. రైతు సంక్షేమ పథకాల అమలుపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రైతు బంధు కింద రూ.10 వేల సాయం అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి మూడు పంటల సీజన్లు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కా లేదని విమర్శించారు. అలాగే కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.5 లక్షల రైతు బీమా పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిపోయిన పిల్లర్ల మరమ్మతులు రెండున్నరేళ్లుగా పూర్తి చేయలేకపోవడాన్ని కూడా ఆయన ఎత్తిచూపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ దేవేందర్ నాయక్, శివకేసరి బాబు, మహిపాల్‌రెడ్డి, కల్లేపల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, రాధాకిషన్‌రావు, నేహాల్, మాజీ ఎంపీపీ మాసర్తి రమేష్, సర్పంచ్ శీలం సురేందర్, పల్లె లక్ష్మీ రవి, పొనిశెట్టి మహేష్, సుమన్‌రావు, అల్లాల ఆనంద్‌రావు, గుండా మధు, హరి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- విప్ ఆది శ్రీనివాస్




ప్రజానావ, వేములవాడ : ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11, 24 వార్డులు, రూరల్ మండలం మల్లారం గ్రామంలో నిర్వహించిన వార్డు, గ్రామ సభల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. సభల్లో వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్యం, జల సంరక్షణ, వనమహోత్సవం, మహిళల భద్రత, వ్యవసాయ రంగం, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, రెండో దశలో మరిన్ని లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, కమిషనర్ లోకేష్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ ఎన్నిక

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల స్మైల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో రాపల్లి శ్రీకాంత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ దిలీప్, కోశాధికారిగా సజ్జనం సురేష్‌లు ఎన్నికయ్యారు. బుధవారం బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో ఈ ముగ్గురు విజయం సాధించారు. 235 మంది సభ్యుల గాను 190 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా బోడ రవీందర్, పోలింగ్ అధికారులుగా సుధగోని సురేష్, సబ్బని ప్రకాష్‌లు వ్యవహరించారు. ఇందులో జిల్లా బాధ్యులుగా గాజుల శ్రీనివాస్, వంకాయల కార్తీక్, మాదాసు రమేష్‌లున్నారు. లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఎన్నికలు జరిగాయి.

# టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి చర్యలు వేగవంతం

- ప్లాట్ల బదిలీ, ఎన్‌ఓసీల జారీకి సంబంధించిన దరఖాస్తులను స్టేట్ లెవల్ కమిటీ సమావేశంలో పరిశీలనకు ఉంచాలి
- సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ పై సమీక్షలో కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లోని వివిధ అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత జౌళి శాఖ అధికారులు, పరిశ్రమల శాఖ, ఇరిగేషన్ శాఖ, మిషన్ భగీరథ శాఖలకు చెందిన అధికారులు, టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ బాధ్యులతో బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లోని ప్లాట్ల బదిలీకి సంబంధించిన ఎన్‌ఓసీల జారీ, టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి సరఫరా, కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)వినియోగం, కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్సీ) ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేస్తూ, ప్లాట్ల బదిలీ, ఎన్‌ఓసీల జారీకి సంబంధించి అందిన అర్హత కలిగిన దరఖాస్తులను వీలైనంత త్వరగా స్టేట్ లెవల్ కమిటీ సమావేశంలో పరిశీలనకు ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి సరఫరా కోసం ఇరిగేషన్ మిషన్ భగీరథ అధికారులతో కలిసి టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి లభ్యత ఉన్న ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని సూచించారు. టెక్స్‌టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భవిష్యత్తులో డైయింగ్, ప్రాసెసింగ్ వంటి యూనిట్లు ఏర్పాటు అయితే సీఈటీపీ సమర్థవంతంగా వినియోగించుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ పై సమగ్ర ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చేనేత, జౌళి సహాయ సంచాలకులు సంతోష్ కుమార్, ఈఈ మిషన్ భగీరథ ముజాహిబ్ అన్వర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం హన్మంతు, టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, యూనిట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

**వివిధ ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్ట్ భూ సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**

జిల్లాలోని వివిధ నీటి పారుదల ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణం కోసం భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ నీటి పారుదల ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణం, వీటీఏడీఏ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణం, వీటీఏడీఏ తదితర నిర్మాణాలు, ప్రస్తుత పరిస్థితిపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రాజెక్టుల కోసం భూ సేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను గోసపెడుతున్న కేంద్రం

- గ్యాస్, పెట్రో ధరలను పెంచి అదనపు భారం
- కలెక్టరేట్ ముందు ధర్నా, నిరసనలో జిల్లా సీపీఐ నేతల ధ్వజం



ప్రజానావ సిరిసిల్ల : గల్ఫ్ యుద్ధాన్ని సాకుగా చూపుతూ కొరత లేదంటూనే గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం మోయలేని భారం మోపుతుందని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి నిరసన చేపట్టారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాల మూలంగా, అలాగే గల్ఫ్ ప్రాంతంలో యుద్ధాన్ని భూచిగా చూపెట్టి, నిరంతరం గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిలువలు వస్తున్నాయని, ఎలాంటి కొరత లేదని ఒక వైపు చెబుతూనే, మరో వైపు పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్యునిపై మోయలేని భారం మోపుతూ, నిత్యావసరాలను సైతం అదుపు చేయకుండా సామాన్యుడు పడే గోసను చూస్తూ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రజా అవసరాలను గుర్తించి ప్రజల కొనుగోలు శక్తికి అనుగుణంగా ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలతో తగిన బుద్ధి చెబుతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా నాయకులు గుంటి వేణు, కడారి రాములు, కె.వి అనసూర్య, సోమ నాగరాజు, తోడేటి పవిత్ర, ఎనగందుల రాజు, పందుగ చంద్రయ్య, డప్పు స్వామి, రవీందర్ తదితర సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## హరిప్రసాద్ చేనేత కళలను సందర్శించిన నిజామాబాద్ ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులు

- సిరిసిల్ల పర్యటన తమకు అనుభవాన్ని ఇచ్చిందన్న విద్యార్థులు, ప్రొఫెసర్‌లు
- భవిష్యత్తులో తాము రూపొందించే డిజైన్లకు హరిప్రసాద్ సూచనలను పాటిస్తామని వెల్లడి

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్లలోని చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ హ్యాండ్లూమ్స్ ను నిజామాబాద్ లోని ఇన్ఫినిటీ కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ స్టూడెంట్స్ బుధవారం సందర్శించారు. దారం నుంచి వస్త్రం ఎలా తయారు చేస్తారన్న ప్రాసెస్ ను వారికి హరిప్రసాద్ వివరించారు. చేనేత కళాకారులు సాధారణ దారం నుంచి రంగు రంగుల డిజైన్ల చీరలను తయారు చేసే విధానాన్ని స్టూడెంట్స్ ప్రాక్టికల్ గా చూపించారు. అలాగే హరిప్రసాద్ తయారు చేసిన అగ్గిపెట్టెలో చీర, ఉంగరం, సూది లో నుంచి దూరే చీరల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ గురించి కూడా విద్యార్థులకు హరిప్రసాద్ వివరించారు. సిరిసిల్ల పర్యటన తమకు మంచి అనుభవాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా విద్యార్థులు చెప్పారు. భవిష్యత్ లో తాము రూపొందించబోయే డిజైన్లకు హరిప్రసాద్ చేసిన సూచనలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ విద్యార్థుల బృందంలో ప్రొఫెసర్లు మాధురి మదాసో, అక్షర తుంగేన, స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడేపు రవీందర్ లు ఉన్నారు.



# ముంబైలో బాంబు బెదిరింపు

- బీఎంసీకి వరుస హెచ్చరిక ఈ–మెయిల్స్
- మేయర్ కార్యాలయం సహా కీలక భవనాలే లక్ష్యమంటూ బెదిరింపులు




**ముంబై :** ముంబైలో బాంబు పేలుళ్లు జరగనున్నాయంటూ బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)కి వచ్చిన బెదిరింపు ఈ–మెయిల్స్ నగరంలో కలకలం రేపాయి. కీలక ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ భవనాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామంటూ వచ్చిన సందేశాలతో పోలీసులు, భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. అధికారుల సమాచారం ప్రకారం, బీఎంసీ అధికారిక ఈ–మెయిల్ చిరునామాలకు పంపిన సందేశాల్లో మేయర్ కార్యాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ), బీఎస్ఈ భవనం, బీఎంసీ ప్రధాన కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని బాంబు దాడులు జరుపుతామని హెచ్చరించారు. ఈ మెయిల్స్‌లో 'ఖలిస్థాన్ నేషనల్ ఆర్మీ' పేరును ప్రస్తావించినట్లు అధికా రులు వెల్లడించారు. కొన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు కూడా ఉన్న ట్లు తెలిపారు. బెదిరింపు సమాచారంతో ముంబై పోలీసులు, బీఎంసీ భద్రతా విభాగాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. మేయర్ కార్యాలయం వద్ద పేలుడు పదార్థాలతో నిండిన కారును ఉపయోగించి దాడి చేస్తామని మెయిల్‌లో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే ఇతర కీలక కార్యాలయాలపై కూడా నిర్దిష్ట సమయాల్లో దాడులు జరుపుతామని హెచ్చరించారు. ఈ ఘటనపై గుర్తుతెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మేయర్ కార్యాలయం, బీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. బెదిరింపు మెయిల్స్ మూలాలను గుర్తించేందుకు సాంకేతిక ఆధారాల సాయంతో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ముంబై మేయర్ రితూ తావ్డే స్పందిస్తూ, ఇలాంటి బెదిరింపులకు తాను భయపడబోనని స్పష్టం చేశారు. ప్రజా సేవలకు ఎలాంటి ఆటంకం కలగనివ్వబోమని పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఈ మెయిల్ అందిన వెంటనే బీఎంసీ విపత్తు నిర్వహణ విభాగం, పోలీసులు తనకు సమాచారం అందించారని చెప్పారు. ముందుగా నిర్ణయించిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజా పనులు నిరంతరంగా కొనసాగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని మరికొన్ని నగరాల మేయర్లకూ ఇలాంటి బెదిరింపు సందేశాలు అందినట్లు సమాచారం ఉందని, దీని వెనుక విస్తృత కుట్ర కోణం ఉండే అవకాశాన్ని కూడా విస్మరించలేమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుతం భద్రతా సంస్థలు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నాయి.

## గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం

- ఢిల్లీ డేటా సెంటర్ అగ్నిప్రమాదం
- పలు నగరాల్లో నెట్‌వర్క్ సమస్యలు
- ట్రాఫిక్‌ను ఇతర కేంద్రాలకు మళ్లించినట్లు ప్రకటించిన గూగుల్



న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఓ థర్డ్‌పార్టీ డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటన ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో గూగుల్ క్లౌడ్ వినియోగదారులు నెట్‌వర్క్ సమస్యలను ఎదుర్కొన్నారు. అగ్నిప్రమాదం కారణంగా అత్యవసర పరిస్థితుల్లో కొన్ని నెట్‌వర్క్ పరికరాలను నిలిపివేయాల్సి వచ్చిందని గూగుల్ వెల్లడించింది. దీంతో ఢిల్లీ, ముంబై, చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల్లో నెట్‌వర్క్ సామర్థ్యం తగ్గిపోయి సేవల పనితీరు దెబ్బతిన్నట్లు తెలిపింది. ఈ అంతరాయం కారణంగా వినియోగదారులు అధిక లేటెన్సీ, ప్యాకెట్ లాస్ వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. కొన్ని యాప్‌లు, వెబ్‌సైట్లు నెమ్మదిగా స్పందించడం, కనెక్టివిటీ లోపాలు తలెత్తడం వంటి ఇబ్బందులు నమోదయ్యాయి. సమస్య ప్రభావాన్ని తగ్గించేందుకు గూగుల్ ప్రభావిత డేటా సెంటర్ నుంచి ఇతర ప్రాంతాల్లోని నెట్‌వర్క్ కేంద్రాలకు ట్రాఫిక్‌ను మళ్లించింది. అయినప్పటికీ కొంతమంది వినియోగదారులకు సేవల్లో అంతరాయాలు కొనసాగినట్లు సమాచారం. కాగా, డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం ఎప్పుడు సంభవించింది, ఘటనలో ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరిగిందా అనే వివరాలను గూగుల్ వెల్లడించలేదు. ప్రస్తుతం సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు ఇంజినీరింగ్ బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని సంస్థ పేర్కొంది.



## ఏనుగుల దాడులకు చెక్..

- 500 మంది సభ్యులతో స్పెషల్ రిజర్వ్ ఫోర్స్ ఏర్పాటు
- మానవ – వన్యప్రాణి ఘర్షణలు తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం


**తిరువనంతపురం :** అడవి ఏనుగుల దాడులను నియంత్రించి, మానవ–వన్యప్రాణి ఘర్షణలను తగ్గించేందుకు కేరళ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏనుగుల సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు 500 మంది సభ్యులతో ప్రత్యేక రిజర్వ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ మంత్రి శింబు బేబీ జాన్ వెల్లడించారు. ఇటీవలి కాలంలో అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో అడవి ఏనుగుల సంచారం, దాడులు పెరగడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. గత రెండు వారాల్లో రాష్ట్రంలో ఏనుగుల దాడుల్లో కనీసం ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వం తక్షణ చర్యలకు దిగింది. ఈ ప్రత్యేక బలగంలో మొత్తం 100 యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో యూనిట్‌లో ఐదుగురు సభ్యులు ఉంటారు. గిరిజన వర్గాల ప్రతినిధులు, అటవీ శాఖ నుంచి పదవీ విరమణ పొందిన సిబ్బంది, స్థానిక అనుభవజ్ఞులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యక్తులకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఏనుగుల సంచార మార్గాలను గుర్తించడం, వాటి కదలికలపై నిరంతర నిఘా ఉంచడం, గ్రామాల సమీపంలో ఏనుగులు కనిపించినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడం, అడవి సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కంచెల పనితీరును పర్యవేక్షించడం వంటి బాధ్యతలను ఈ బలగం నిర్వహించనుంది. అలాగే జనావాసాల వైపు వచ్చిన ఏనుగులను సురక్షితంగా తిరిగి అడవుల్లోకి మళ్లించే ప్రక్రియలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లకు (ఆర్ఆర్‌టీ) సహకరించనుంది. మానవులు, వన్యప్రాణుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టే ఇతర కార్యక్రమాల్లోనూ ఈ బృందం భాగస్వామ్యం కానుంది. ఘర్షణలకు గురయ్యే ప్రాంతాల్లో నిరంతర గస్తీ, పర్యవేక్షణ నిర్వహించడం ద్వారా ప్రజల భద్రతను పెంచడంతో పాటు ఏనుగుల దాడుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించగలమని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై కాంగ్రెస్ ఆగ్రహం

**ఢిల్లీ/భోపాల్:** మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం అసాధారణమని, వెంటనే సరిదిద్దాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) పార్టీ డిమాండ్ చేసింది. నామినేషన్ తిరస్కరణపై కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.సి. వేణుగోపాల్, జైరాం రమేశ్, అభిషేక్ మను సింఘ్వి, వివేక్ తన్ఖా, రణదీప్ సూర్జేవాలా, భూపేశ్ బఘేల్, దీపా దాస్‌మున్షీ తదితరులతో కలిసి మీనాక్షి నటరాజన్ బుధవారం ఎన్నికల సంఘం అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ, తన నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాజ్యాంగ సంస్థలపై విశ్వాసంతోనే న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ, రిటర్నింగ్ అధికారి నిర్ణయం చట్టపరంగా సమర్థించలేనిదని అన్నారు. రెండేళ్లకు పైగా శిక్ష పడే కేసుల వివరాలను మాత్రమే అఫిడవిట్‌లో పేర్కొనాలని ప్రజా ప్రాతి నిధ్య చట్టం స్పష్టం చేస్తోందని గుర్తుచేశారు. మీనాక్షి విషయంలో ప్రస్తావించిన అంశం కేవలం ప్రైవేటు ఫిర్యాదుకు సంబంధిం చినదేనని, అది ఇంకా న్యాయపరమైన విచారణ దశలోకి కూడా ప్రవేశించలేదని తెలిపారు. ఇదిలా ఉండ గా, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను నిరసిస్తూ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు భోపాల్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. అధికార పార్టీ ఒత్తిడితోనే పథకం ప్రకారం ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు.

## అమరావతికి కేంద్రం భారీ ఊతం

- కేంద్ర కార్యాలయాలు, ఉద్యోగుల గృహాల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం
- 8 వేల మందికి కార్యాలయ సదుపాయాలు.. 1,504 నివాస గృహాల ఏర్పాటు



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయ సముదాయం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస గృహాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టానికి రాష్ట్రపతి ఆమోదం లభించి అమరావతికి అధికా రిక రాజధాని హోదా వచ్చిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన నివాస సౌకర్యా లు కల్పించేందుకు జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) ప్రాజెక్టును చేపట్టను న్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగుల సంక్షేమం, పనితీరు మెరుగుదలతో పాటు నివాస భారం తగ్గించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని పేర్కొంది.

### 17 ఎకరాల్లో 1,504 నివాస గృహాలు

జీపీఆర్ఏ ప్రాజెక్టును 17 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 11 నివాస టవర్లు నిర్మించబడతాయి. టైప్–2 నుంచి టైప్–6 వరకు మొత్తం 1,504 గృహ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. సుమారు 1,972 కార్ల పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30 లక్షల చదరపు అడుగులు కాగా, ఇందులో 9.10 లక్షల చదరపు అడుగుల బేస్‌మెంట్ ప్రాంతం ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, స్థానిక నిర్మాణ సామ గ్రి వినియోగం, నివాసితుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో గృహ సముదాయాన్ని నిర్మించనున్నారు.

### 8 వేల మందికి కేంద్ర కార్యాలయ సముదాయం

అమరావతిలో కేంద్ర ప్రభుత్వ జనరల్ పూల్ ఆఫీస్ అకమోడేషన్ (సీజీజీపీఓఏ) ప్రాజెక్టుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసి పరస్పర సమన్వయాన్ని పెంచడంతో పాటు ప్రజలకు సేవలను మరింత సమర్థవంతంగా అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉంది. ఈ కార్యాలయ సముదాయాన్ని 5.53 ఎకరాల్లో నిర్మించనున్నారు. సీ–9 ప్లాట్‌లో గ్రౌండ్ ప్లస్ 13 అంతస్తులు, సీ–8 ప్లాట్‌లో గ్రౌండ్ ప్లస్ 10 అంతస్తులతో రెండు ప్రధాన బ్లాక్‌లు నిర్మించబడతాయి. ఇందులో సుమారు 8 వేల మంది అధికారులు, ఉద్యోగులు పనిచేసేలా సదుపాయాలు కల్పించనున్నారు. అదనంగా 1,800 కార్ల పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 23.25 లక్షల చదరపు అడుగులుగా ఉండనుంది. అమరావతిని ప్రపంచ స్థాయి గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నగరంగా తీర్చిదిద్దే దిశలో ఈ ప్రాజెక్టులు కీలక మైలురాయిగా నిలుస్తాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉనికి పెరగడం ద్వారా రాజధాని నగర అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## మళ్లీ ముదిరిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

- రాన్‌పై అమెరికా వైమానిక దాడులు
- ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యం టెహ్రాన్ ప్రతిదాడులు




**దుబాయ్:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరోసారి యుద్ధ వాతావరణానికి దారితీస్తున్నాయి. హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ కూలిన ఘటన నేపథ్యంలో అమెరికా ఇరాన్‌పై వైమానిక దాడులు చేపట్టగా, ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు ప్రయత్నించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శాంతి చర్చల్లో జాప్యం కొనసాగితే టెహ్రాన్ మరింత భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అవసరమైతే మరిన్ని దాడులు కూడా చేపడతామని స్పష్టం చేశారు. బుధవారం తెల్లవారుజామున అమెరికా యుద్ధవిమానాలు ఇరాన్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలు, నిఘా రాడార్ కేంద్రాలు, గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించాయి. బందర్ అబ్బాస్, కెష్మ్ దీవి పరిసర ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్లు ఇరాన్ వీకరించినప్పటికీ, నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించలేదు.

### గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతిస్పందన

అమెరికా దాడుల అనంతరం ఇరాన్ కువైట్, బహ్రెయిన్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. జోర్డాన్‌లోని మువాఫాక్ సాల్టీ వైమానిక స్థావరం వైపు దూసుకొచ్చిన ఐదు క్షిపణులను అడ్డుకున్నట్లు ఆ దేశ సైన్యం ప్రకటించింది. కువైట్, బహ్రెయిన్ కూడా తమ గగనతలంలోకి వచ్చిన డ్రోన్లు, క్షిపణులను విజయవంతంగా నిర్వీర్యం చేసినట్లు వెల్లడించాయి. అమెరికా అపాచీ హెలికాప్టర్ కూలిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అమెరికా అధికారులు తెలిపారు. ఇరాన్‌కు చెందిన డ్రోన్ ఢీకొనడంతోనే హెలికాప్టర్ కూలిపోయిందని ప్రాథమికంగా గుర్తించినప్పటికీ, అది ఉద్దేశపూర్వక దాడా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదన్నారు. ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, అమెరికా–ఇరాన్ మధ్య చర్చల ద్వారా పరిష్కారం కనుగొనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మధ్యవర్తిత్వం కోసం ఖతార్ ప్రతినిధి బృందం టెహ్రాన్‌కు చేరుకుని చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని టైర్ నగరానికి తూర్పున ఉన్న ఓ గ్రామంపై జరిగిన దాడిలో ఆరుగురు మృతి చెందినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.


## నేపాల్ నిషేధంపై ఆందోళనలో మామిడి రైతులు

- పురుగుమందుల అవశేషాల కారణంగా దిగుమతులకు బ్రేక్
- భారత మామిడి ప్రతిష్టపై ప్రభావం ఉంటుందన్న రైతుల ఆవేదన



**లక్నో :** భారతదేశం నుంచి మామిడి పండ్ల దిగుమతులను నిలిపివేయాలన్న నేపాల్ ప్రభుత్వ నిర్ణయం ఉత్తరప్రదేశ్ మామిడి రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నిర్ణయం వల్ల రైతుల ఆదాయంపై పెద్దగా ప్రభావం లేకపోయినా, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత మామిడి నాణ్యత, ప్రతిష్టపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. పురుగుమందుల అధిక అవశేషాలు, సరిహద్దు ప్రాంతాల్లో తగిన క్వారంటైన్ సదుపాయాల లేమిని కారణాలుగా చూపుతూ నేపాల్ అధికారులు భారత మామిడి దిగుమతులపై నిషేధం విధించారు. ఇటీవలే జపాన్ కూడా ప్రస్తుత సీజన్‌కు భారత తాజా మామిడి దిగుమతులను నిలిపివేయడంతో ఈ పరిణామం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో ప్రముఖ మామిడి ఉత్పత్తి కేంద్రంగా పేరుగాంచిన ఉత్తరప్రదేశ్‌లోని మలిహాబాద్ ప్రాంతం ప్రత్యేకించి దశేరి మామిడి రకానికి ప్రసిద్ధి. ఇక్కడ పండే మామిడిని దేశీయ మార్కెట్లతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. అయితే ఈ నిషేధం రైతుల ఆదాయంపై గణనీయమైన ప్రభావం చూపదని ఉత్తరప్రదేశ్ వ్యవసాయ మార్కెటింగ్, విదేశీ వాణిజ్యం, ఎగుమతుల శాఖ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. నేపాల్ ఒక స్వతంత్ర దేశమని, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధిత అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆయన అన్నారు. భారత రైతులు అత్యుత్తమ నాణ్యత గల మామిడిని ఉత్పత్తి చేసి దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. నేపాల్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ఆయన కోరారు. ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఉత్పత్తిదారుగా ఉన్న భారత్‌లో ఏటా 2.6 కోట్ల మెట్రిక్ టన్నులకుపైగా మామిడి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా రకాల మామిడి పంట సాగవుతోంది. అమెరికా, యూఏఈ, బ్రిటన్, నెదర్లాండ్స్, సౌదీ అరేబియా వంటి దేశాలు భారత మామిడికి ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలుగా ఉన్నాయి.

## డ్రోన్ బోట్‌తో సాహసోపేత రక్షణ ఆపరేషన్



**వాషింగ్టన్:** సముద్రంలో ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు అమె రికా పైలట్లను మానవరహిత డ్రోన్ బోట్ సురక్షితంగా రక్షించడం ద్వారా అమెరికా రక్షణ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. తొలిసారిగా నిర్వహించిన ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో అమెరికా రక్షణ వ్యవస్థలు ఊరట పొందాయి. ఈ అత్యాధునిక డ్రోన్ బోట్‌ను భారతీయ అమెరికన్ వైభవ్ ఆల్టేకర్ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న టెక్సాస్‌కు చెందిన సరోనిక్ టెక్నాలజీస్ సంస్థ అభివృద్ధి చేయడం విశేషం.

### హెలికాప్టర్ ప్రమాదం.. స్పందించిన నౌకాదళం

అమెరికాకు చెందిన ఏహెచ్–64 అపాచీ హెలికాప్టర్ హర్మూజ్ జలసంధి సమీపంలో పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదానికి గురైంది. హెలికాప్టర్ ఒమన్ తీరానికి సమీపంలో కూలిపోగా, అందులోని ఇద్దరు పైలట్లు ప్రాణాలతో బయటపడ్డారు. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బహ్రెయిన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అమెరికా నౌకాదళ టాస్క్‌ఫోర్స్–59 అత్యవసర చర్యలు చేపట్టింది. టెక్సాస్‌కు చెందిన సరోనిక్ టెక్నాలజీస్ రూపొందించిన 'కోర్స్‌ఎయిర్' ఆటానమస్ డ్రోన్ బోట్‌ను రక్షణ చర్యల కోసం వినియోగించారు. మానవ సిబ్బంది అవసరం లేకుండానే పనిచేసే ఈ సాంకేతిక నౌక సముద్రంలో ఉన్న పైలట్లను గుర్తించి సురక్షితంగా మరో ప్రాంతానికి తరలించింది. దీంతో అమెరికా తొలిసారిగా మానవరహిత సముద్ర వాహనాన్ని ఉపయోగించి విజయవం తమైన రక్షణ ఆపరేషన్‌ను పూర్తి చేసింది.

### భారతీయుడి సాంకేతిక ముద్ర

సరోనిక్ టెక్నాలజీస్‌ను 2022లో టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో నలు గురు భాగస్వాములు కలిసి స్థాపించారు. వారిలో భారతీయ అమె రికన్ వైభవ్ ఆల్టేకర్ ఒకరు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందిన ఆయన ప్రస్తుతం సంస్థలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆటానమస్ వ్యవస్థలు, సముద్ర సాంకేతిక రంగాల్లో ఆయనకు విశేష నైపుణ్యం ఉంది. ఈ విజయంతో భారతీయ ప్రతిభ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

## పీవోకేలో కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్

- సాంకేతిక లోపంతో జరిగిన ప్రమాదం
- సైనిక సిబ్బంది మృతిపై పాక్ సైన్యం ధృవీకరణ

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవో కే)లో పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఎంఐ–17 హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న సైనిక సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు పాక్ సైన్యం వెల్లడించింది. అయితే హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది సంఖ్యను అధికారికంగా ప్రకటించలేదు. స్థానిక మీడియా కథనాల ప్రకారం ఈ ప్రమాదంలో సుమారు 21 మంది సైనికులు మృతి చెందినట్లు సమాచారం. ముజఫరాబాద్ ప్రాంతంలో స్థానిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల నేప థ్యంలో అదనపు బలగాలను మోహరించేందు కు ఈ హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సైనికులతో ముజఫరాబాద్ నుంచి బయలుదేరిన హెలికాప్టర్ టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సాంకేతిక లోపం తలెత్తి కుప్పకూ లినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంద ని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని పాక్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి.

# అఫ్గాన్ సిరీస్‌కు హార్దిక్ దూరం!

## తొడ కండరాల గాయంతో మూడు వారాల విశ్రాంతి

- ఇప్పటికే సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ
- కీలక ఆటగాళ్ల గాయాలపై బీసీసీఐ ఆందోళన

**ముంబై:** అఫ్గానిస్థాన్‌తో మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు ముందు భారత జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో, ఇప్పుడు ప్రముఖ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా జట్టుకు అందుబాటులో ఉండబోవడం లేదని బీసీసీఐ వర్గాల సమాచారం. ఇటీవల వెన్ను నొప్పి కారణంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కొన్ని మ్యాచ్‌లకు హార్దిక్ దూరంగా ఉన్నాడు. ఐపీఎల్ ముగిసిన అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి అతడు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరయ్యాడు. ఆ పరీక్షల్లో సానుకూల ఫలితాలు రావడంతో అతడు అఫ్గానిస్థాన్ సిరీస్‌కు సిద్ధంగా ఉన్నాడనే సంకేతాలు కనిపించాయి. అయితే, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అతడి ఫిట్‌నెస్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన ఒక రోజు వ్యవధిలోనే కొత్త పరిణామం చోటుచేసుకుంది. హార్దిక్ పాండ్య తొడ కండరాల గాయానికి గురైనట్లు, దీంతో సుమారు మూడు వారాలపాటు క్రికెట్‌కు దూరంగా ఉండనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. హార్దిక్ వైదొలగడం భారత జట్టుకు పెద్ద లోటుగా భావిస్తున్నారు. అతడి స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న అంశంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విరాట్ కోహ్లీ స్థానంలో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేసిన బీసీసీఐ, హార్దిక్‌కు ప్రత్యామ్నాయంగా ఎవరిని ఎంపిక చేస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. కాగా, 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలలో భాగంగా భారత్‌కు పరిమిత సంఖ్యలో మాత్రమే వన్డే మ్యాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచకప్‌కు ముందు టీమిండియా కేవలం తొమ్మిది వన్డేలు మాత్రమే ఆడనుండటంతో, ప్రతి సిరీస్ జట్టు ప్రణాళికల్లో కీలకంగా మారింది. ఇలాంటి సమయంలో కీలక ఆటగాళ్లు గాయాలతో దూరమవడం జట్టు యాజమాన్యాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.



# గుర్తింపు కోసం పోరాడాల్సి వచ్చేది

- నా క్రికెట్ బ్యాగ్ చూసి హాకీ ప్లేయరా అని అడిగేవారు
- భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్



**న్యూఢిల్లీ:** భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తన క్రికెట్ ప్రస్థానంలోని తొలి రోజుల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. 1990వ దశకంలో మహిళల క్రికెట్‌కు పెద్దగా గుర్తింపు లేకపోవడంతో ఆటగాళ్లు ఎన్నో సవాళ్లను ఎదుర్కొనాల్సి వచ్చేదని ఆమె తెలిపారు. ఒక కార్యక్రమంలో మాట్లాడిన మిథాలీరాజ్, తాను క్రికెట్ ఆడటం ప్రారంభించిన రోజుల్లో భారత్‌లో మహిళలు కూడా క్రికెట్ ఆడతారనే విషయం చాలా మందికి తెలియదని చెప్పారు. క్రికెట్ కిట్ బ్యాగ్‌ను చూసి ప్రజలు తనను హాకీ క్రీడాకారిణిగా భావించి ప్రశ్నించేవారని పేర్కొన్నారు. నేను క్రికెట్ ఆడటం ప్రారంభించినప్పుడు మహిళల క్రికెట్ గురించి అవగాహన చాలా తక్కువగా ఉండేది. నా క్రికెట్ బ్యాగ్ చూసి 'మీరు హాకీ ఆడతారా?' అని అడిగేవారు. ఎవరూ నన్ను క్రికెటర్‌గా గుర్తించేవారు కాదు. అలాగే అప్పట్లో వీధుల్లో బాలికలు క్రికెట్ ఆడడం కూడా చాలా అరుదుగా కనిపించేది అని మిథాలీ తెలిపారు. మహిళల క్రికెట్ 2007లో భారత క్రికెట్ నియంత్రణ మండలి పరిధిలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయని ఆమె పేర్కొన్నారు. అంతకుముందు మహిళల క్రికెట్ మనుగడ కోసం పోరాడాల్సిన పరిస్థితి ఉండేదని, ఆటకు గుర్తింపు తీసుకురావడం కోసం క్రీడాకారిణులు ప్రత్యేకంగా కృషిచేయాల్సి వచ్చేదని చెప్పారు. ప్రేక్షకులను ఆకర్షించడంలో వ్యక్తిగత ప్రతిభ కీలక పాత్ర పోషించేదన్నారు.

**కొత్త విషయాలు నేర్చుకోవాలి**

ఇదిలా ఉండగా, త్వరలో ప్రారంభం కానున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ సందర్భంగా భారత జట్టుకు మిథాలీ రాజ్ పలు సూచనలు చేశారు. ఆటగాళ్లు విశాల దృక్పథంతో ఉండి నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా మారేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. మరో రెండు రోజుల్లో ప్రారంభమయ్యే ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ తన తొలి మ్యాచ్‌ను చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఆడనుంది.







ధర్మశాలలో అఫ్గానిస్థాన్‌తో జరగనున్న తొలి వన్డేకు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా క్యాచింగ్ డ్రిల్‌లో పాల్గొన్న క్రికెటర్ రోహిత్ శర్మ

# రిచా పోరాటం వృథా

- ఉత్కంఠ పోరులో టీమిండియా పరాజయం
- వార్మప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో 6 పరుగుల తేడాతో ఓటమి



**కార్డిఫ్:** ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ సన్నాహక మ్యాచ్‌లో భారత మహిళల జట్టుకు చేదు అనుభవం ఎదురైంది. ఉత్కంఠభరితంగా సాగిన రెండో వార్మప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ మహిళల జట్టు 6 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. చివరి వరకు ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో రిచా ఘోష్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ భారత జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 19.5 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటై ఓటమిపాలైంది. భారత బ్యాటర్లలో వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ అద్భుతంగా రాణించింది. కేవలం 36 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 68 పరుగులు చేసి చివరి వరకు పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. స్మృతి మంధాన (1), షెఫాలీ వర్మ (13), యస్తిక భాటియా (15), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17), భారతి ఫుల్మాలి (18), రాధా యాదవ్ (16), శ్రేయాంక పాటిల్ (1), క్రాంతి గౌడ్ (1), రేణుకా సింగ్ ఠాకూర్ (0) నిరాశపరిచారు. శ్రీచరణి 6 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఇంగ్లాండ్ బౌలర్లలో లిన్సే స్మిత్ మూడు వికెట్లు పడగొట్టగా, డానియెల్ గిబ్సన్, టిల్లీ కోర్ట్‌న్-కోల్‌మన్, ఛార్లెట్ డీన్ తలో రెండు వికెట్లు సాధించారు. ఇస్సీ వాంగ్ ఒక వికెట్ తన ఖాతాలో వేసుకుంది.

**అర్ధ శతకాలతో రాణించిన అమీజోన్స్, హాడ్జ్**

అంతకుముందు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో అమీ జోన్స్ (64) మరియు డాని వ్యాట్-హాడ్జ్ (57) అర్ధశతకాలతో జట్టుకు బలమైన స్కోరు అందించారు. డానియెల్ గిబ్సన్ కేవలం 12 బంతుల్లో 30 పరుగులు చేసి వేగంగా స్కోరు పెంచింది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ రెండు వికెట్లు తీయగా, షెఫాలీ వర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, శ్రీచరణి, రాధా యాదవ్ తలో వికెట్ సాధించారు. కాగా, తొలి వార్మప్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 26 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, రెండో మ్యాచ్‌లో ఓటమి పాలవడంతో ప్రపంచకప్‌కు ముందు తన బలాబలాలను మరోసారి అంచనా వేసుకునే అవకాశం లభించింది.




రాంచీలోని జార్ఖండ్ స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (జేఎస్‌సీఏ) అంతర్జాతీయ స్టేడియం కాంప్లెక్స్‌లో బుధవారం జార్ఖండ్ టీ20 లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు టీమిండియా మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ హాజరయ్యారు.

## Business
## బిజినెస్

# బంగారం, వెండి ధరలకు బ్రేక్


- పసిడి రూ.4,300, వెండి రూ.10 వేల వరకు పతనం
- డాలర్ బలోపేతం, పెరిగిన క్రూడాయిల్‌తో దిగివచ్చిన ధరలు



**ముంబై:** దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా డాలర్ బలోపేతం, క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో ఈ విలువైన లోహాలపై డిమాండ్ తగ్గడంతో ధరలు దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర ఒక్కరోజులోనే రూ.4,300 తగ్గి అన్ని పన్నులు కలిపి రూ.1.56 లక్షలకు చేరింది. ఇదే సమయంలో కిలో వెండి ధర దాదాపు రూ.10 వేల మేర క్షీణించి రూ.2.45 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా బంగారం, వెండి ధరలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఔన్సు బంగారం ధర 90 డాలర్లు పడిపోయి 4,168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ధర 2.24 శాతం తగ్గి ఔన్సుకు 63.87 డాలర్లకు చేరింది. అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు పైగా చేరాయి. ఇంధన ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు అధికమవుతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా డాలర్ మరింత బలపడటంతో బంగారం వంటి సురక్షిత పెట్టుబడి సాధనాలపై కొనుగోలు ఆసక్తి తగ్గినట్లు పలువురు అనలిస్టులు పేర్కొంటున్నారు.

# జట్టుకట్టిన రిలయన్స్, మెటా

- జామ్‌నగర్‌లో భారీ డేటా సెంటర్‌ను అభివృద్ధి చేయనున్న దిగ్గజ సంస్థలు
- 168 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టు.. రెండేళ్లలో అందుబాటులోకి
- ఏఐ, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణకు కీలక అడుగు




**ముంబై:** డేటా నిల్వ, ప్రాసెసింగ్, డిజిటల్ సేవల విస్తరణలో కీలక పాత్ర పోషించే డేటా సెంటర్ రంగంలో మరో భారీ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. దేశీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్, సోషల్ మీడియా దిగ్గజం మెటా కలిసి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో 168 మెగావాట్ల సామర్థ్యంతో అత్యాధునిక డేటా సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండు సంస్థలు బుధవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం సుమారు రెండేళ్లలో ఈ డేటా సెంటర్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా మెటా నిర్వహిస్తున్న డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఈ డేటా సెంటర్ మద్దతు అందించనుంది. ముఖ్యంగా సంస్థ వ్యాపార కార్యకలాపాలు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కంప్యూటింగ్ అవసరాలను తీర్చడంలో ఇది కీలకపాత్ర పోషించనున్నట్లు పేర్కొంది. అదేవిధంగా, 1 గిగావాట్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు క్లీన్‌మ్యాక్స్, ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మెటా ప్రకటించింది. డేటా సెంటర్ నిర్వహణకు అవసరమైన స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని పెంచడమే ఈ ఒప్పందం లక్ష్యంగా తెలిపింది.

**భాగస్వామ్యం ఇప్పటిదికాదు..**

రిలయన్స్, మెటా మధ్య భాగస్వామ్యం కొత్తది కాదు. 2020లో జియో ప్లాట్‌ఫామ్స్‌లో మెటా 9.99 శాతం వాటాను కొనుగోలు చేసి వ్యూహాత్మక పెట్టుబడి పెట్టింది. అనంతరం రెండు సంస్థలు కలిసి 100 మిలియన్ డాలర్ల పెట్టుబడితో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేశాయి. దేశీయ, అంతర్జాతీయ సంస్థల కోసం కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై ఈ భాగస్వామ్యం దృష్టి సారించింది. ఇదిలాఉంటే మెటాతో కొత్త భాగస్వామ్య ప్రకటన వెలువడిన వెంటనే స్టాక్ మార్కెట్లో రిలయన్స్ షేర్లకు కొనుగోలు మద్దతు లభించింది. బుధవారం బీఎస్ఈలో రిలయన్స్ షేరు ధర 2.39 శాతం పెరిగి రూ.1,300 స్థాయికి చేరుకుంది.

# లాభాలు ఆవిరి..

- స్వల్ప పెరుగుదలతో ముగిసిన సెన్సెక్స్
- చివరి గంట అమ్మకాలతో ఒత్తిడిలో సూచీలు.. నిఫ్టీకి నష్టం

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య ముగిశాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంకింగ్, రియాల్టీ రంగాల షేర్ల మద్దతుతో ప్రారంభంలో లాభాల్లో దూసుకెళ్లిన సూచీలు, చివరి గంటలో అమ్మకాల ఒత్తిడికి లోనై ఆ లాభాలను దాదాపు కోల్పోయాయి. ఇంట్రాడే గరిష్ఠ స్థాయిల నుంచి సెన్సెక్స్ సుమారు 600 పాయింట్లు వెనక్కి తగ్గింది. బీఎస్ఈ సెన్సెక్స్ 73,918.76 పాయింట్ల వద్ద ముగిసిన గత సెషన్‌తో పోలిస్తే స్వల్ప లాభంతో 73,988.27 వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్ సమయంలో 74,613.01 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సూచీ, చివరికి కేవలం 64 పాయింట్ల లాభంతో 73,983.18 వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 27.15 పాయింట్లు కోల్పోయి 23,214.95 వద్ద స్థిరపడింది. విదేశీ మారక మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.27 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 91.44 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ఔన్సు ధర 4,167 డాలర్ల వద్ద ట్రేడైంది. సెన్సెక్స్-30 సూచీలో ఎటర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరోవైపు హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంకులు లాభాలను నమోదు చేశాయి.



# సెల్యులాయిడ్ దిగ్గజం భారతీరాజా ఇకలేరు

**భారతీయ సినీ పరిశ్రమకు తీరని లోటు**



దక్షిణ భారత సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీరాజా 84 ఏళ్ల వయసులో చెన్నైలో కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో పాటు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తమిళంతో పాటు తెలుగు సినీ పరిశ్రమలు కూడా దిగ్భ్రాంతికి గురయ్యాయి. తమిళనాడు ప్రభుత్వం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 1941 జులై 17న జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినైలే చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి తమిళ సినిమాకు కొత్త దిశను చూపించారు. గ్రామీణ జీవనశైలి, సహజమైన కథనాలతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన సినీ ప్రయాణంలో ఎన్నో చిరస్మరణీయ చిత్రాలను అందించారు. తెలుగు ప్రేక్షకులతోనూ భారతీరాజాకు ప్రత్యేక అనుబంధం ఉంది. 'సీతాకోకచిలుక', 'ఆరాధన', 'జమదగ్ని' వంటి చిత్రాలతో ఆయన తెలుగు సినీ చరిత్రలో చెరగని ముద్ర వేశారు. 'సీతాకోకచిలుక' చిత్రానికి జాతీయ పురస్కారంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు కూడా అందుకున్నారు. అంతేకాకుండా 'మంగమ్మగారి మనవడు' చిత్రానికి కథను, 'పల్నాటి పౌరుషం' చిత్రానికి స్క్రీన్‌ప్లేను అందించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ ప్రశంసలు అందుకున్న భారతీరాజా, ఇటీవల తుడరుమ్ చిత్రంలో కీలక పాత్రలో కనిపించారు. భారతీయ సినిమాకు అందించిన విశిష్ట సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2004లో ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఇక వ్యక్తిగత జీవితంలోనూ ఆయన తీవ్ర విషాదాన్ని ఎదుర్కొన్నారు. గత ఏడాది తనయుడు, నటుడు మనోజ్ భారతీరాజా ఆకస్మికంగా మృతి చెందడం భారతీరాజాను తీవ్రంగా కలచివేసింది. ఆ దుఃఖం నుంచి పూర్తిగా కోలుకోలేకపోయారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమాను గ్రామీణ మట్టివాసనతో ప్రపంచానికి పరిచయం చేసిన మహా దర్శకుడి మరణంతో భారతీయ చలనచిత్ర రంగం ఓ గొప్ప సృజనకర్తను కోల్పోయింది.

## భారతీరాజాకు అశ్రునివాళి

### రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం




దిగ్గజ దర్శకుడు భారతీ రాజా మరణంతో దక్షిణ భారత సినీ పరిశ్రమ విషా దంలో మునిగిపో యింది. ఆయన పార్థివదేహానికి రాజకీయ, సినీ ప్రముఖులు పెద్దఎత్తున నివాళులర్పి స్తున్నారు. అభిమానుల సందర్శ నార్థం చెన్నై లోని ఆయన నివాసంలో పార్థివ దేహాన్ని ఉంచగా, ప్రముఖులు వరుసగా చేరుకుని తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు ముఖ్య మంత్రి విజయ్ భారతీరాజా నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పిం చారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. భారతీరాజా మరణం భారతీయ సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు. డీఎంకే అధ్యక్షుడు ఎం.కే. స్టాలిన్ కూడా భారతీరాజాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో తనకున్న అనుబం ధాన్ని గుర్తు చేసుకున్నారు. గ్రామీణ జీవితాన్ని సహజత్వంతో వెండితెరపై ఆవిష్కరించి తమిళ సినిమాకు కొత్త దిశను చూపిన దర్శకుడు భారతీరాజా అని కొనియాడారు. స్టూడియో లకు పరిమితమైన చిత్రీకరణను గ్రామాల వరకు తీసుకెళ్లి, వాస్తవికతకు పెద్దపీట వేసిన దర్శకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన చిత్రాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సీనియర్ నటి రాధిక కూడా భారతీరాజా పార్థివదేహానికి నివాళుల ర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా భారతీరాజా మరణంపై సంతాపం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల కు పైగా సినీ రంగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దర్శకుడి గానే కాకుండా నటుడిగా కూడా విశేష గుర్తిం పు పొందిన భారతీరాజా, వివిధ భాషల్లో ఎన్నో వైవిధ్యభరితమైన చిత్రాలను అందించారని గుర్తు చేశారు. ఆయన మరణం భారతీయ చలనచి త్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. భారతీరాజా తన చిత్రాల ద్వారా భారతీయ సినిమాకు కొత్త దారులు చూపిన మహోన్నత దర్శకుడిగా ఎప్పటికీ గుర్తుండిపోతారని సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు.

## రక్షాబంధన్ కానుకగా 'ఈశ' విడుదల

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధకపూర్ మరోసారి వైవిధ్యభరితమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'స్త్రీ 2' విజయానంతరం ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న బయోపిక్ చిత్రం ఈశ విడుదలకు సిద్ధమవుతోంది. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి వితబాయి భౌమాంగ్ నారాయణంగాఓంకర్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ఛావా' విజయంతో గుర్తింపు పొందిన నిర్మాత దినేష్ విజన్, దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ కాంబినేషన్‌లో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. 1940 నుంచి 1990 దశకాల మధ్య విఠాబాయి కళా ప్రస్థానం, ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఈ సినిమాలో ఆవిష్కరించనున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయిన ఈ బయోపిక్‌ను రక్షాబంధన్ సందర్భంగా ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించినట్లు బాలీవుడ్ వర్గాలు వెల్లడించాయి. కళాకారిణి జీవితంలోని భావోద్వేగాలు, పోరాట స్ఫూర్తి, కళాపట్ల అంకితభావాన్ని ప్రతిబింబించే ఈ చిత్రం శ్రద్ధా కపూర్ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## వైద్యుడిగా రజనీకాంత్?

**కొత్త పాత్రపై సినీ వర్గాల్లో ఆసక్తి**



సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ చిత్రంలో మరో విభిన్న మైన పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రముఖ నటుడు కమల్‌హాసన్ నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందనున్న ఈ చిత్రానికి దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్న ఈ సినిమా వచ్చే నెలలో సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో రజనీకాంత్ వైద్యుడి పాత్రలో కనిపించనున్నారనే వార్తలు కోలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నా యి. చెన్నైలో ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించి గుర్తింపు పొందిన ఓ ప్రముఖ వైద్యుడి జీవితం నుంచి ప్రేరణ పొంది ఈ పాత్రను రూపొందిం చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ పాత్రకు సంబంధించిన ప్రత్యేక ఫొటో షూట్ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. చిత్రీకరణ కోసం చెన్నై సమీపంలోని పూనమల్లిలో భారీ సెట్‌ను నిర్మిస్తున్నా రని, అది పూర్తయిన వెంటనే షూటింగ్ ప్రారంభించే అవకాశముందని సమాచారం. మరోవైపు రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్ర మాలను పూర్తి చేసుకుంటోంది. ఈ చిత్రం సెప్టెంబరులో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, కొత్త సినిమాలో రజనీ పోషించనున్న వైద్యుడి పాత్రపై అభిమానుల్లో ఇప్పటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది.

## ఖాకీ దుస్తుల్లో సాయిపల్లవి?



విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకుల మన్ననలు పొందుతున్న కథానాయిక సాయిపల్లవి మరోసారి కొత్త అవతారంలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల ప్రేమకథా నేపథ్యంలో రూపొందిన 'ఏక్ దిన్' చిత్రంలో నటించిన ఆమె, త్వరలో 'రామాయణ'లో సీత పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉండగా, తమిళ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి రూపొందిస్తున్న కొత్త చిత్రంలో సాయిపల్లవి కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'ధనుష్ 55' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆమె పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్రలో యాక్షన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉండనుందని, ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన రూపంలో సాయిపల్లవి కనిపించబోతున్నారని టాక్. ఖాకీ దుస్తుల్లో ఆమె నటన, యాక్షన్ సన్నివేశాలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో సాయిపల్లవితో పాటు శ్రీలీల మరో కథానాయికగా నటిస్తోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలు వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## 'బేబీ డూ డై డూ' టీజర్‌తో ఉత్కంఠ

బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'బేబీ డూ డై డూ' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రతీకారం, రహస్యాలు, అనూహ్య మలుపులతో కూడిన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి నచికేత్ సామంత్ దర్శకత్వం వహించగా, నటుడు సాకిబ్ సలీం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన అధికారిక టీజర్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. "చుట్టూ ఎంతమంది ఉన్నా ఒంటరితనమే... బేబీ ఏం చేసినా ప్రాణాలు తీస్తుంది" అనే వ్యాఖ్యలతో ప్రారంభమయ్యే ఈ టీజర్ ఉత్కంఠభరితంగా సాగుతుంది. ముంబయి నగరంలోని మిస్టీరియస్ వాతావరణంలో చిత్రీకరించిన టీజర్‌లో హ్యూమా ఖురేషి ఎర్రటి గొడుగును ఆయుధంగా మార్చుకుని హత్యలు చేసే సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రంలో ఆమె ఓ రహస్య కిరాయి హంతకురాలు 'బేబీ' పాత్రలో కనిపించనుంది. చుంకీ పాండే, సీమా పహ్వా, రచిత్ సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజర్‌తోనే ఉత్కంఠను రేకెత్తించిన ఈ మూవీ విడుదలపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. **RNI NO: TELTEL/2023/87657**